గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఫిబ్రవరి 2014
# కథలు




హోరాహోరీగా కేసు వాదించేసి, జడ్జీ గారు ఇచ్చే తీర్పు వినడానికి ఉత్సుకతతో నిలబడ్డ లాయర్లలా రాధాకృష్ణ ఎదుట నిలబడ్డారు అనసూయమ్మ గారూ, అపర్ణా ఆరోజు ఉదయం. ఒకరు అతడిని కన్న తల్లి. మరొకరు అతడిని కట్టుకున్న ఇల్లాలు. ఇద్దరూ రెండు వర్గాలకి ప్రతినిదుల్లా నిలబడి వున్నారు.

అప్పటికే అతడు ఇద్దరి వాదనలూ వినడం చాలా సార్లు అయిపోయింది. ఇంక నిర్ణయం తీసుకోవడమే తరువాయి.

ఇంతకీ అసలు సమస్యేమిటంటే, పది రోజుల క్రితం వాళ్ళింటికి పోస్టులో ఒక పెళ్ళి శుభలేఖ వచ్చింది.

శుభలేఖలన్నాక పోస్టులో వస్తుంటాయి, కొరియర్లో వస్తుంటాయి. వీలుని బట్టి ఈ మధ్యన ఈ - మెయిల్లోనూ, చివరాఖరికి సెల్ ఫోన్లో సంక్షిప్త సందేశాలుగానూ కూడా పంపిస్తున్నారు. అందువల్ల శుభలేఖ రావడం పెద్ద సమస్యా అని మీరనచ్చు. నిజమే -

శుభలేఖ రావడం సమస్య కాదు. అది పోస్టులో రావడమూ సమస్య కాదు. రాధాకృష్ణ కూడా మీలాగే అనుకున్నాడు మరో వారానికి మరో శుభలేఖ అదే పోస్టులో వచ్చేంత వరకూ. ఆ రెండో శుభలేఖ వచ్చాకే శుభలేఖ రావడం కూడా సమస్యేనన్న విషయం తెలిసివచ్చింది అతడికి.

విషయమేమిటంటే మొదటి శుభలేఖ వచ్చింది తూర్పునుంచి. విశాఖపట్నంలో వున్న అతడి తల్లి వేలు విడిచిన మేనమామ దగ్గరనుంచి. రెండో శుభలేఖ పడమర నుంచి. అంటే అమెరికా నుంచి. అపర్ణ 'కజిన్ బ్రదర్' దగ్గర నుంచి.

రెండు పెళ్ళిళ్ళూ ఒకే ముహూర్తానికి. ఇప్పుడు తూర్పుకి వెళ్ళాలా, పడమరకి వెళ్ళాలా అన్నది సమస్య. తూర్పుకి ప్రతినిధి తల్లి. పడమరకి ప్రతినిధి భార్య. ఇంటికి యజమానీ, పెత్తనం వున్నవాడూ కనుక నిర్ణయించాల్సింది రాధాకృష్ణ. అతడి నిర్ణయం తిరుగులేని నిర్ణయం. అతడు చెప్పే తీర్పు ఇంట్లో అందరికీ శిరోధార్యం.

అత్తగారి తరపు బంధుత్వం దూరపు బంధుత్వం అన్నది అపర్ణ వాదన. దూరపు బంధుత్వమైనా వాళ్ళు బాగా కావాల్సిన వాళ్ళు అంటుంది అనసూయమ్మ గారు. విడి విడిగా వింటే ఇద్దరి వాదనా నిజమే అనిపిస్తుంది రాధాకృష్ణకి.

రెండు వైపుల నుంచి ఒత్తిడి ఎక్కువైపోవడంతో రాధాకృష్ణకి నిర్ణయం తీసుకోవడం కష్టమైపోతోంది. అందుకే ఎటూ చెప్పకుండా తాత్సారం చేస్తున్నాడు. అ తాత్సారం ఆడవాళ్ళలో ఆదుర్దాని మరింత పెంచుతోంది. ఎలాగైనా తీర్పు తమవైపు వుండేలా చేసుకోవాలని ఆఖరి అస్త్రంగా ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్ కి కూడా దిగారు.

"ఆయన బ్రతికున్నాళ్ళూ ఆయన చెప్పినట్టు నడుచుకున్నారు. ఇప్పుడు నీ హయాం కనుక నువ్వు చెప్పినట్టు వినాల్సిందే. కానీయ్ ఏం చేస్తావో - నీ ఇష్టం" అని కొడుకు ఎదుట ముక్కు చీదింది అనసూయమ్మగారు.

"కడివెడు గుమ్మడికాయైనా కత్తిపీటకు లోకువే అని బామ్మ చిన్నప్పుడే చెప్పింది. ఆడదాని ఇష్టాలూ కోరికలూ ఎలా వున్నా సంసారంలో చెల్లుబాటయ్యేది మగాడి నిర్ణయమే కదా? చెప్పండి. మీరెక్కడికి సర్దమంటే అక్కడికి సర్దుతాను బట్టలు" అంది శ్రీమతి.

ఎక్కడికైనా సర్దాల్సింది ఒకే బట్టలు కదా అన్న ఆలోచన రాధాకృష్ణకా క్షణంలో రాలేదు. ఇద్దరి మీదా సానుభూతిగా అనిపించింది. ఎవరివైపు తీర్పు చెప్పాలన్నా భయంగా అనిపించింది. 'పెత్తనం చెలాయించడం' లో కూడా ఇంత కష్టం వుంటుందా అనుకున్నాడు.

***

ఆఫీసుకు చేరుకున్నా ఆలోచన వదల్లేదు రాధాకృష్ణని. ఎవరో ఒకరితో చర్చించకపోతే లాభంలేదనుకున్నాడు. హాజరు పట్టికలో సంతకం చేసేసి తోటి ఉద్యోగి సుబ్బారావుని తీసుకుని క్యాంటిన్కి కాఫీకి వెళ్ళాడు. సుబ్బారావు ఎలాంటి విషయంలోనైనా సలహాలివ్వడంలో దిట్ట.

క్యాంటీన్ కుర్రాడు కాఫీలు తెచ్చేదాకా మౌనంగా వుండి, కాఫీలు వచ్చాక పైకప్పుకేసి చూసి నిట్టూరుస్తూ జనాతికంగా అన్నాడు రాధాకృష్ణ "ఒక్కోసారి నిర్ణయాధికారం వుండడం కూడా ఇబ్బందిగానే ఉంటుంది. సరైన నిర్ణయం తీసుకోవడమంత కష్టమైన విషయం మరొకటుండదు".

సుబ్బారావు విచిత్రంగా చూసాడు రాధాకృష్ణ మాటలకి. "నువ్వు చేసే బోడి గుమస్తా ఉద్యోగానికి నిర్ణయాలు తీసుకునేంత సమస్యలేమున్నాయి?' అన్నట్టుగా చూస్తూ 'ఆఫీసులో ఏదైనా సమస్యా?' అన్నాడు.

రాధాకృష్ణ తల అడ్డంగా ఆడిస్తూ "ఆఫీసులో కాదు - ఇంట్లో" అన్నాడు. విషయం మొత్తం సుబ్బారావు కి వివరించి "ఇంట్లో పెత్తనం అంతా నాదే. నా మాటకి తిరుగుండదు. కానీ, నేనేం చెబితే అది చెలామణీ అవుతుంది కదా అని ఏది పడితే అది చెప్పడం నాకిష్టం లేదు. అందుకే ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థం కావడం లేదు" అన్నాడు.

అతడి మాటలకి సుబ్బారావు పకపకా నవ్వాడు. "నువ్వొట్టి అమాయకుడివి గురూ" అన్నాడు కాఫీ ఆఖరి గుటకని ఆస్వాదిస్తూ. రాధాకృష్ణకి ఒళ్ళు మండింది. అవమానంగా అనిపించింది. 'ఇరవై రూపాయలు ఖర్చుపెట్టి అతడ్ని కాఫీకి పిలిపించి ఈ మాట అనిపించుకోవడానికా?' అనుకున్నాడు.

సుబ్బారావు అతడి మనోభావాలనేమాత్రం పట్టించుకోకుండా "నువ్వే కాదు - ఈ ప్రపంచంలో వున్న మగాళ్ళంతా నీలా అమాయకులే" అన్నాడు నవ్వుతూనే.

"ఇంతకీ ఏమిటి నువ్వనేది?" కాఫీ కప్పు బల్లమీద పెడుతూ అడిగాడు రాధాకృష్ణ ఆశ్చర్యంగా.

"మీ ఇంట్లో పెత్తనం అంతా నీదేనని నువ్వనుకుంటున్నావు గానీ అది శుద్ధ అబద్ధం. ఒట్టి భ్రమ!"

రాధాకృష్ణ అర్థం కానట్టుగా చూసాడు అతడి వంక. సుబ్బారావు నవ్వుతూ తన లెక్చర్ని మొదలుపెట్టాడు. "మీ ఇంట్లో నీ పెత్తనం, నిర్ణయాధికారం పేరుకు మాత్రమే. నిజానికి మీ ఇంట్లో పెత్తనమంతా ఆడవాళ్ళదే. చిన్న ఉదాహరణ చెబుతాను విను. ఆదివారం సాయంత్రం సరదాగా నువ్వు కుటుంబంతో కలిసి సినిమాకెడదామనుకుంటావు. మీ అమ్మగారు ఒక సినిమా పేరు చెబుతారు. వెంటనే మీ ఆవిడ కల్పించుకుని అదికాదని మరొక సినిమా పేరు చెబుతుంది. ఏ సినిమాకెళ్లాలన్న ప్రశ్న వచ్చినప్పుడు ఇద్దరూ నీ ఇష్టం అంటారు. నిర్ణయాధికారం నీకు బదలాయిస్తారు.

నువ్వు నీకిష్టమైన సినిమాలన్నింటినీ పక్కన పెట్టి వాళ్ళు చెప్పిన రెంటిలో ఏదో ఒకటి ఎంచుకుని నువ్వు పెత్తనం చెలాయిస్తున్నాననుకుంటావు. ఆ మాత్రం ఎంపిక చేసినందుకే రెండో వాళ్ళ నిరసనలూ, అలకలూ సహనంగా భరిస్తావు. ఏ విషయమైనా ఇంతే. నువ్వు అయితే మీ శ్రీమతి చెప్పినట్టు వినాలి, కాకపోతే ఆమె అత్తగారు చెప్పినట్టైనా వినాలి. కాని నీ సొంతనిర్ణయం తీసుకునే వీలు కానీ, సావకాశం కాని నీకు వుండవు. దీన్నే నువ్వు 'పెత్తనం' అని అనుకుంటుంటే అది అమాయకత్వం కాక మరేమిటి?!'

రాధాకృష్ణ బుర్ర తిరిగిపోయింది ఆ మాటలకి. సుబ్బారావు ఎప్పుడూ అంతే. ఏ విషయాన్నైనా ఎవరూ చూడని మూడో కోణం లోంచి చూస్తాడు. "ఇప్పుడు ఈ సమస్యనే తీసుకో - వాళ్ళ వాదనలని పక్కన పెట్టి చెప్పు? రెండు పెళ్ళిళ్లలో నీకే పెళ్ళికి వెళ్ళడం ఇష్టం?" అని ప్రశ్నించాడు.

రాధాకృష్ణ ఆలోచనలో పడ్డాడు. నిజానికిప్పుడు అతడికే పెళ్ళికీ వెళ్ళడం ఇష్టం లేదు. నెలాఖరులో వున్నాడు. క్రిందటి నెల పండగ బట్టలకి తీసుకున్న అప్పు ఇంకా తీర్చలేదు. అసలు తనా కోణంలో ఆలోచించనే లేదు! అతడి బుర్ర వేడెక్కిపోయింది. మరో కప్పు కాఫీ తెప్పించుకుని గటగటా తాగేశాడు.

"ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే బాగా ఆలోచించి నీకిష్టమైన నిర్ణయాన్ని తీసుకుని ఈసారి నీ నిర్ణయాధికారాన్ని సరీగ్గా వినియోగించు" అన్నాడు సుబ్బారావు ముక్తాయింపుగా.

అప్పటికే రాధాకృష్ణ ఒక 'నిర్ణయానికి' వచ్చేసాడు!

***

కొసమెరుపు : ఆ సాయంత్రం రాధాకృష్ణ ఇంటికి వచ్చేసరికి ఇల్లు పెళ్ళి వారిల్లులా వుంది. అనసూయమ్మ గారు, అపర్ణా మతాబుల్లా వెలిగిపోతున్న ముఖాలతో ఎదురొచ్చారు. పిల్లలు గబుక్కున వచ్చి అతడి చెయ్యి పట్టుకుని కుదుపుతూ "నాన్నా... నాన్నా... మనం పెళ్ళికి వెడుతున్నాం" అన్నారు.

"ఎవరి పెళ్ళికి?" హడలిపోతూ ఆశ్చర్యంగా అన్నాడు.

"నే చెబ్తానుండరా..." అంటూ అనసూయమ్మగారు ముందుకు వచ్చింది. "నువ్వు ఆఫీసుకి వెళ్ళాక నాకెందుకో బుద్ధి పుట్టి ఆ అమెరికా వాళ్ళ శుభలేఖ అడిగి తీసుకుని చూసాను. తీరా చూద్దును కదా? ఆశ్చర్యం... రెండూ ఒక పెళ్ళివే! విశాఖపట్నం వాళ్ళ అమ్మాయినే అమెరికా వాళ్ళ అబ్బాయికి చేసుకుంటున్నారు!! ఇంకేముందీ? కాగల కార్యం గంధర్వులే తీర్చేసారు. మనం ఇన్ని రోజులూ అనవసరంగా మల్ల గుల్లాలు పడ్డాం అనుకుని వెంటనే కోడలికి చెప్పి బట్టలు సర్దించేశాను" అంది.

"ఏవండోయ్... ఇద్దరూ ఒకటే కదా అని చదివింపులు ఒకళ్ళకే ఇచ్చి చేతులు దులిపేసుకుందామనుకుంటున్నారేమో? అదేం కుదరదు. అసలే అవతలి వాళ్ళు అత్తయ్యగారికి బాగా కావాల్సిన వాళ్ళు కూడాను" కాఫీ కప్పుతో వచ్చిన అపర్ణ అంది నవ్వుతూ.

తూర్పు - పడమర ఏకం కావడమంటే ఏమిటో మొదటిసారిగా అర్ధమైంది రాధాకృష్ణకి!!

***




www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com

జడ్జి తీర్పు చెప్పబోయే ముందు కోర్టులో నెలకొనే నిశ్శబ్దం... ఇప్పుడా ఇంట్లో ఉంది. పేరులో తప్ప శరీరంలో ఎక్కడా అందంలేని సుందరరామయ్య గారు జడ్జిలా వరండా మధ్యలో కుర్చీలో కూర్చుని ఉన్నారు. తండ్రి పోలికలు ఏమీ లేకుండా బుట్టబొమ్మలా అందంగా ఉన్న ఆయన కూతురు పద్మావతి సాక్షిలా ఆయన పక్కనే నిలబడి ఉంది. ఎదురుగా ముద్దాయిలా నేను. చేతులు నలుపుకుంటూ, భయభయంగా మామయ్య వైపు చూస్తూ, ఆయన చెప్పే తీర్పు కోసం గాబరాగా ఎదురు చూస్తున్నాను. అప్పటికే నా వాదనలు వినిపించడం పూర్తయింది. కొద్ది నిమిషాల మౌనం తర్వాత ఆయన మాట్లాడటం మొదలు పెట్టాడు.

నువ్వు పద్మను ప్రేమించడంలో తప్పేం లేదు. ఎందుకంటే నువ్వు నా తోడబుట్టిన దాని కొడుకువి కాబట్టి, అది నీ మరదలు కాబట్టి. తను నీ హక్కని నువ్వు అనుకొని ఉండొచ్చు. కానీ దాన్ని నువ్వు పెళ్లి చేసుకోవడానికి మాత్రం ఆ ఒక్క అర్హత సరిపోదు.

ఇంకేం కావాలి.... భయభయంగానే అడిగాను.

యువరాణిని చేసుకోబోయే వాడు కచ్చితంగా యువరాజే అయ్యుండాలి. అట్టాగే రాణి లాంటి నా కూతుర్ని చేసుకోబోయే వాడు కచ్చితంగా ఈ కాలపు యువరాజు అయ్యుండాలి.

యువరాజంటే... అయోమయాన్ని కుతూహలంతో కలిపి అడిగాను.

అది కూడా తెలియదా..! మొద్దు వెధవ. ఈ కాలపు యువరాజంటే జీతంలోనూ, సుఖంలోనూ మరెవ్వరూ పోటీపడలేని సాఫ్ట్ వేర్ ఇంజనీర్. అట్టాంటి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కే నా కూతుర్ని ఇచ్చి కళ్యాణం చేస్తా. నీలా ట్రాక్టర్ దున్నుకుంటూ, పొలం పనులు చేసుకునే వాడికి కాదు.

నేను పొలం పనులు చేసే వాడినే కాని... పనికి మాలిన వాడిని కాదు. డిగ్రీ పాసయ్యాను. వ్యవసాయం అంటే ఇష్టం కాబట్టే పొలం పనులు చేస్తున్నా. పొలం మీద వచ్చే ఆదాయం సాఫ్ట్ వేర్ ఇంజనీర్లకన్నా తక్కువేం కాదు... నా వృత్తిని అవమానించినందుకు వచ్చిన కోపంతో ధైర్యంగా చెప్పా.

నాకదంతా అనవసరం రా. నీకు ఆర్నెల్లు గడువిస్తున్నా. చేతైతే సాఫ్ట్ వేర్ ఇంజనీరై తిరిగిరా. లేకుంటే నా కూతురి పెళ్లికి రా. పప్పన్నం తిని ఎప్పటిలాగే పొలం పనులు చూసుకుందువు గానీ... ఈ లోపు నువ్వు నా కూతురి వైపు చూసినా, మాట్లాడినా నేనేం అనను. ఎందుకంటే అది రేపు సాఫ్ట్ వేర్ ఇంజనీరు భార్యగా హైదరాబాదో, అమెరికానో వెళ్లి... హైక్లాస్ సొసైటీలో ఉండాల్సిన పిల్ల. అలాంటి దాన్ని ఇలా కట్టుదిట్టాలు చేయడం నాకు ఇష్టం లేదు... అంటూ విసవిసా లోపలికి వెళ్లిపోయాడు.

నేనేమీ చేయలేనట్లు అమాయకంగా చూస్తూ నిలబడిపోయింది పద్మావతి.

జీవితంలో తొలిసారి ఒకడ్ని మర్డర్ చేయాలనిపించింది. వాడే శివాజీ. మా ఊరి నుంచి తొలి సాఫ్ట్ వేర్ ఇంజనీర్. మాకు కంప్యూటర్ని పరిచయం చేసింది వాడే. శివాజీని ఊరుఊరంతా నడిచే దేవుడిలా చూస్తుంది. వాడి చరిత్రను గోరుముద్దలతో రంగరించి పసిపిల్లల నోటికి అందిస్తారు. ఒకసారి వాడే మా మామయ్యను హైదరాబాద్ తీసుకెళ్లి హైటెక్ సిటీ అంతా తిప్పాడు. అద్దాల మేడల్లో అందమైన ఇంటీరియర్ తో ఉన్న కంపెనీల్లోకి తీసుకెళ్లాడు. ఒక వారం దగ్గర ఉంచుకుని ఆ కల్చర్ని, వీకెండ్ సెలబ్రేషన్స్ ని పూర్తిగా అలవాటు చేశాడు. అప్పటి నుంచి ఆయనకు ఈ పిచ్చి పట్టుకుంది. అది ఎంత వరకు వెళ్లిందంటే...

మనిషంటే సాఫ్టవేర్ ఇంజనీరే అని అనుకునేటంత.

సాధారణంగా ఎవర్నైనా మీరేం చేస్తుంటారు అని అడుగుతారు. మామయ్య మాత్రం మీరు సాఫ్ట్ వేర్ ఇంజనీరేనా అని అడుగుతాడు. పొరపాటున అవతలి వాళ్లు కాదంటే... అప్పటి వరకు చూపించిన గౌరవ మర్యాదలు అమాంతం పడిపోతాయి. సంబోధన దాదాపు 'ఏరా' స్థాయికి వెళుతుంది. 'ఏడిశావ్ లే...' అంటూ సాగుతుంది. 'ఇక... మూస్తావా' అనే అర్థంతో ముగుస్తుంది. ప్రస్తుతం ఆయన దృష్టిలో మనుషులు రెండు రకాలు. ఒకటి సాఫ్టవేర్ ఇంజనీర్లు. రెండు మిగిలిన వారందరూ. చంద్రముఖి సినిమాలో నగల్ని చూసే సమయంలో జ్యోతిక ముఖంలో కనిపించే వెలుగే... సాఫ్ట్ వేర్ ఇంజనీర్ని చూసినప్పుడు మామయ్య ముఖంలోనూ కనిపిస్తుంది. విష్ణుమూర్తి పదకొండో అవతారం సాఫ్ట్ వేర్ ఇంజనీరేనని ఆయనకు బలమైన విశ్వాసం. తిరుమల కొండ కన్నా సైబర్ టవర్సే పవిత్రమైందని ఆయన నమ్మకం. ఆ నమ్మకంతోనే ఎలా ఆన్ చేయాలో తెలియకపోయినా... ఓ కంప్యూటర్ని తెచ్చి హాల్లో పెట్టుకున్నాడు. మామయ్య ఈ మధ్య మగవాళ్లనైతే సాఫ్ట్ వేర్ ఇంజనీర్లై వర్థిల్లాలని, ఆడవాళ్లనైతే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ మొగుడిగా రావాలని దీవిస్తున్నాడని ఇంటి దగ్గర మా నాన్న అంటుంటే ఒకసారి విన్నాను.

మామయ్యకు సాఫ్ట్ వేర్ ఇంజనర్లంటే పిచ్చని నాకు తెలుసుకాని... మరీ ఈ స్థాయిలో అని నేను ఊహించలేదు. ఊరంతా మామయ్యని సాఫ్ట్ వేర్ రామయ్య అని ఎందుకంటారో... నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది. పద్మావతి పదో తరగతి ఫెయిలై తప్పించుకుందిగానీ... లేకపోతే దాన్ని సాఫ్ట్ వేర్ ఇంజనీర్ని చేసేదాక నిద్రపోయేవాడు కాదు... కూతుర్ని నిద్రపోనిచ్చే వాడు కాదు.

ఇంటికి ఏ సంబంధం వచ్చినా... వాళ్లను మామయ్‌య మొదటిగా అడిగే ప్రశ్నలు 'సి' లాంగ్వేజ్ వచ్చా... జావా గురించి తెలుసా... సైబర్ టవర్స్ ని ఒక్కసారన్నా చూశావా... అక్కడ అడ్డంగా తల ఊపితే ఇక అంతే... మామయ్య ఉగ్రనరసింహుడైపోతాడు. ప్రోగ్రామ్ రాయడం చేతగాని వాడికి పెళ్లెందుకంటూ రెచ్చిపోతాడు. కీబోర్డ్ మీద లయబద్ధంగా నాట్యం చేయని చేతులతో తాళెలా కడతావని ప్రశ్నిస్తాడు. ఒరాకిల్ గురించి తెలియని వాడు జీవితంలో ఏ మిరాకిల్ చేయలేడంటూ అందర్నీ ఊరి చివరి వరకు తరిమి కొడతాడు. నిజానికి మామయ్యకు శాలరీ గురించి కూడా పెద్దగా పట్టింపు లేదు. సాఫ్ట్ వేర్ ఇంజనీరైతే చాలు. ఒకసారి మా ఊరి పూజారి పెద్ద సంబంధం తీసుకొచ్చాడు. వరుడు ఇస్రోలో సైంటిస్ట్. జీతం దాదాపు లక్ష రూపాయలు. వాళ్లని కూడా మామయ్య సాఫ్ట్ వేర్ మంత్రాలతో బెదరగొట్టి పంపించాడు. తర్వాత కూతురి కోసం ఆయన చూసిన సాఫ్ట్ వేర్ వరుళ్ల జీతాలు ఆ సైంటిస్ట్ శాలరీలో మూడో వంతు కూడా లేవు. కంప్యూటరంటే తెలియని, ఇంగ్లిష్ పరిజ్ఞానం ఏ మాత్రం లేని పద్మావతిని పెళ్లి చేసుకోవడానికి ఇప్పటి వరకు ఏ సాఫ్ట్ వేరు ఇంజనీరు ముందుకు రాకపోవడం కచ్చితంగా నా అదృష్టమే.

అయితే ఆ అదృష్టానికి కాలం చెల్లే రోజులు రావడంతో... ఆ రోజు సాయంత్రం బావి దగ్గర పద్మావతిని కలిశాను. నాకు నువ్వన్నా ఇష్టమే... మా నానన్నా ఇష్టమే... ఇద్దరిలో ఎవర్నీ వదులుకోలేనూ అంటూ పాతరాగమే పాడింది. పైగా నువ్వు ఆరు నెలల్లో అన్ని కోర్సులు నేర్చుకుని సాఫ్ట్ వేర్ ఇంజనీరై పోవచ్చుగా అని ఓ ఉచిత సలహా కూడా పడేసింది. ఇంట్లో ఖాళీగా ఉండటం వల్ల అన్ని చాన్నళ్లలోని సినిమాలు ఎడాపెడా చూసేయగా... వచ్చిన జ్ఞానంతో కొన్ని పంచ్ డైలాగులు కూడా విసిరింది. సంకల్పంతో

సాధించలేనిది ఏదీ లేదంటూ ఓ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చింది. అదే సంకల్పంతో నువ్వు పదో తరగతి పరీక్షలు మళ్లీ రాసి పాసైపోవచ్చుగా... అని నేననగానే అలిగి మూతిముడుచుకుంది. అరగంట బతిమాలాక మళ్లీ మాట్లాడటం మొదలు పెట్టింది... అదీ ఇలాంటి జోకులేస్తే ఊరుకోననే షరతుతో. ఒకే మాట తను చెబితే కొటేషన్ ఎలా అయిందో... నేను చెబితే జోక్ ఎలా అయిందో నాకు అర్థం కాలేదు.

ఇన్నేళ్ల నుంచి కలిసి తిరుగున్నా పద్మావతి మనపక్షమో అర్థం కాదు... ప్రతి పక్షమో(నాన్న పార్టీ) అర్థం కాదు. పోని తను నన్ను ప్రేమించడం లేదా అంటే... తన కళ్లల్లో కనిపిస్తున్న ప్రేమ అబద్ధం కాదు... అలాగే గుండెల్లో వాళ్ల నాన్న మీదున్న గౌరవమూ అబద్ధం కాదు. తను ఎదుటివాళ్లను మోసం చేసేటంత తెలివైంది కాదు.. అలా అని మోసపోయేటంత అమాయకురాలు కూడా కాదు. ఎదిగిన పసిపిల్ల... ఇరవై ఏళ్ల చిన్నపాప అంతే. అవ్వాకావాలి... బువ్వాకావాలి అనుకునే మనస్తత్వం. అతిశయోక్తి అనుకోకపోతే ఒక మాట చెబుతాను... నేను ఈ ప్రపంచంలో తనని తప్ప ఎవర్ని పెళ్లి చేసుకున్నా సంతోషంగానే ఉంటాను. తను మాత్రం నన్ను తప్ప ఇంకెవ్వర్ని పెళ్లి చేసుకున్నా సంతోషంగా ఉండలేదు. ఎందుకంటే తనను ప్రేమించడం మాత్రమే కాదు. భరించాలి కూడా. ఆమె ప్రేమను, అలకను, కోపాన్ని... సమస్తాన్ని నేను మాత్రమే భరించగలను. ఎందుకంటే నేను నాకన్నా ఎక్కువగా తననే ప్రేమిస్తున్నాను కాబట్టి...

లేచిపోవడానికి, పారిపోవడానికి పద్మావతి రాదుకాబట్టి... నాక్కూడా అంత ధైర్యం లేదు కాబట్టి... తప్పనిసరి పరిస్థితుల్లో నేను సాఫ్ట్ వేర్ ఇంజనీర్ని పోవాలని బలంగా నిర్ణయించుకున్నాను. పుస్తకాలన్నీ తెప్పించుకుని దగ్గర పెట్టుకుని, ఓ స్నేహితుడి సహకారంతో నేర్చుకోవడం ప్రారంభించాను. కనీసం నెలైనా పడుతుందనుకున్నాను గానీ... మొదలు పెట్టిన రెండు రోజుల్లోనే నాకు అర్థమైపోయింది... ఇలా చదివితే నేను సాఫ్ట్ వేర్ ఇంజనీరవడం అసాధ్యమని. ఇలా లాభం లేదనుకుని ఓ మంచి ముహూర్తం చూసుకుని బస్సెక్కి హైదరాబాద్ బయలుదేరాను. ఏ ఇన్ స్టిట్యూట్లో చూసినా గుట్టలుగా ఉన్న స్టూడెంట్లు. ఫ్యాకల్టీ చెప్పేది సరిగా వినిపించదు. కనిపించదు. అర్థం కాదు. అలా మైత్రివనం ముచ్చట కూడా మూడు రోజుల్లో తీరిపోగా... సొంతూరికి తిరుగుప్రయాణమయ్యాను. అయినా దారిపొడవునా ఒకటే ఆలోచన... సాఫ్ట్ వేర్ జాబ్ లేకుండా మామయ్యని ఒప్పించ లేను. ఇష్టం లేని చదువు చదవలేను... అలా అని పద్మావతిని వదులుకోలేను... ఏం చేయాలి... ఏం చేయాలి... ఏం చేయాలి.

ఆ రోజు సాయంత్రం ఊరిలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. శివాజీ నాన్నకు గుండెపోటు అన్న వార్త దావానలంలా వ్యాపించింది. వెంటనే పక్కనున్న టౌన్లోని హాస్పిటల్ కు తీసుకెళ్లారు. అక్కడ ఆయన్ను పరీక్షించిన డాక్టర్లు గుండె వాల్వ్స్ అన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని... బతకడం అసాధ్యమని... దగ్గరి వాళ్లకు కబురు చేసుకోండని చెప్పారు. తన కొడుకుని ఒక్కసారి చూడాలని ఉందని ఆయన అతి కష్టం మీద చెప్పాడు. దాదాపు అదే ఆయన ఆఖరి కోరిక కావచ్చు. సుందరరామయ్య మామయ్య వెంటనే శివాజీకి ఫోన్ చేశాడు. విషయం తెలుసుకున్న శివాజీ భోరుమన్నాడు. బాధపడేందుకు సమయం లేదు. మీ నాన్న ప్రాణం నిమిషాల మీద ఉంది. నువ్వు వెంటనే బయలుదేరి రావాలి అని మామయ్య చెప్పాడు. దానికి శివాజీ చెప్పిన సమాధానం విని చెట్టంత మామయ్య ఒక్కసారిగా కూలబడిపోయాడు.

సాఫ్ట్ వేర్ ఫీల్డ్ లో ఇప్పుడు రిసెషన్ నడుస్తుందని... కంపెనీలన్నీ ఉద్యోగులను తగ్గించుకునే పనిలో ఉన్నాయని... తీసేయడానికి కారణాలు వెతుకుతున్నాయని... ఇప్పటికే వీకెండ్స్ తో పాటు అన్ని ఫెసిలిటీస్ క్యాన్సిల్ చేశారని... ఇలాంటి పరిస్థితిలో తను లీవ్ అడిగిన మరుక్షణం... పింక్ స్లిప్ టేబుల్ మీద... తను గేటు బయట ఉంటామని చెప్పాడు. ఉద్యోగం పోతే ఫ్లాట్ కోసం, కారు కోసం, ఊళ్లో పొలాల కొనుగోలు కోసం, ఆడంబరాల కోసం చేసిన అప్పులు జన్మలో తీర్చలేనని... ఇలాంటి పరిస్థితిల్లో తాను సెలవు పెట్టి రాలేనని... పరిస్థితుల వల్ల రాలేకపోతున్నానే కానీ తండ్రి మీద ప్రేమలేక కాదని చెబుతూ... కార్యక్రమాలన్నీ దగ్గరుండి చూసుకోవాలని మామయ్యను కన్నీళ్లతో ప్రాధేయపడ్డాడు. మరో గంటలో ఆయన ప్రాణం పోయింది. ఊరుఊరంతా గొల్లు మంది. అప్పటి వరకు ఊరికి హీరోగా కనిపించిన శివాజీ... ఒక్కసారిగా విలన్ గా కనిపిస్తున్నాడు. మామయ్య మాత్రం పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. అయినా శివాజిని క్షమించలేకపోతున్నాడు. దాని గురించే రోజుల తరబడి మథన పడుతున్నాడు. జన్మంతా పూజించిన దేవుడు... ఆపద వేళ ముఖం చాటేస్తే భక్తుడు పడే బాధను... ఇప్పుడు మామయ్య అనుభవిస్తున్నాడు.

ఆ రోజు రాత్రి నేను మామయ్య ఇంటికి వెళ్లాను.

వెళ్లేముందు నేను చాలా ప్రిపేర్ అయ్యాను. సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు కూడా మనుషులేనని... డాక్టర్, లాయర్, కలెక్టర్... ఆఖరికి గవర్నమెంట్ టీచర్ కూడా కాలేక సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా స్థిరపడతారని... తొంభై శాతం మంది కేవలం డబ్బు కోసమే ఆ వృత్తిని ఎంచుకుంటారు తప్ప... ప్రేమతో కాదని... నువ్వు వాళ్ల సుఖాలు చూశావు తప్ప... టెన్షన్లు చూడలేదని... గ్యారెంటీ లేని ఉద్యోగాలు, మితిమీరిన ఒత్తిడి, రాత్రి డ్యూటీలు, డెడ్ లైన్లతో చిన్నవయసులోనే షుగర్లు, బీపీలు తెచ్చుకుని గుండె జబ్బులతో ఆస్పత్రి పాలవుతున్నారని... ఇలా ఏవేవో... అనుకుని వెళ్లాను.

నేను వెళ్లగానే ఆయన నాతో అన్న మొదటి మాట... 'ముహూర్తాలు ఎప్పుడు పెట్టిచ్చమంటావ్ రా...' అని...

ఈ మాటను ఊహించని పద్మావతి తండ్రి వంక కొంచెం ఆశ్చర్యంగా, మరికొంచెం ఆనందంగా చూస్తూ నిలబడింది.

మీ ఇష్టం మామయ్య అంటూ... రెండు లక్షలు పెట్టి కొన్నసాఫ్ట్ వేర్ ఉద్యోగానికి సంబంధించిన అప్పాయిట్ మెంట్ ఆర్డర్ని మడిచి జేబులో పెట్టుకుని వెనుదిరిగాను.

***



www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com

మస్కారం! నేను మీ సునీల్ అంబాని. మన దేశంలోని ధనవంతులలో ఒక్కడిని. ఇప్పటిదాకా నన్ను చాలా మంది రకరకాల ప్రశ్నలు అడిగారు. కాని అందరూ అడిగే ఒకే-ఒక్క ప్రశ్న ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేని నేను ఎలా ధనవంతుడినయ్యానని. కాని నాకున్న ఒకే ఒక్క ఆస్తి మా నాన్నగారు! భయపడకండి... ఇది సెంటిమెంట్ కథ కాదు.

అప్పట్లో అడ్డూ అదుపూ లేకుండా అన్ని ధరలూ పెరిగిపోయాయన్నది మనందరికీ తెలిసిన విషయమే! సోషల్-నెట్‌వర్కింగ్ సైట్స్ లో, పుస్తకాల్లో ఇలా ఎక్కడ పడితే అక్కడ వీటి మీద జోక్స్ రావడం కూడా మనందరికీ తెలిసిందే! వీటి గురించి నేను ప్రత్యేకంగా ఏం చెప్పడానికి ఇది రాయలేదులే కాని నా జీవితంలో జరిగిన ఓ సందర్భాన్ని మీతో పంచుకోవడానికే ఇది రాయడం జరిగింది. ధరలు మనసును పిండే రోజులవి. దరిద్రం మాకు నిత్యపాఠాలు చెప్పే దిక్కుమాలిన రోజులవి.

"ఏమండీ! మీరివాల పని మీద బయటకి వెళ్తానన్నారు కద." అంది మా ఆవిడ.

"అవును. ఏం? వచ్చేటప్పుడేమైనా తీసుకురావాలా?" అని అడిగాను.

"అంటే..మీకు ఖజానా నగల షాపు తెలుసుకదా ?"

"ఆ...తెలుసు..! వచ్చేటప్పుడు ఏమైనా నెక్లెస్ తీసుకురావాలా?" అని అడిగాను.

"అబ్బే లేదండి. ఆ నగల షాపు ముందు ధనలక్ష్మి కిరాణా కొట్టులోంచి ఓ కేజీ ఉల్లిపాయలు తీసుకొస్తారా ?" అని అడిగింది.

"ఏంటి....ఉల్లిపాయలా ? మొన్నే కద తెచ్చాను!" అని అరిచాను.

"అదేంటండీ... నగలు కావాలా అని గొప్ప రాజసంగా అడిగారు... ఇంతా చేస్తే ఉల్లిపాయలకి బెదిరిపోయారు!" అంది నవ్వుతూ వెటకారంగా.

"బంగారందేముందే... ఒక్కసారి కొని దాచుకుంటాం. కానీ ఈ ఉల్లిపాయలు అలా కాదు కద... ఎన్నో సార్లు కొనాల్సొస్తుంది!" అని బాధగా అన్నాను.

"అందుకే మిమ్మల్ని అక్కడ కొనమన్నాను. అక్కడైతే మనకి రెండు రూపాయలు తక్కువగా ఇస్తారండి!" అని ఆనందంగా చెప్పింది.

"సరే ఐతే, నేను బయల్దేరుతాను" అని బయట అడుగు పెట్టాను.

"ఏమండీ! కార్ కీస్ మర్చిపోయారు!" అంది తాళాలిస్తూ.

"కారా ?? ఏంటి జోకా? పెట్రోల్ ధర బి.పి కంటే వేగంగా పెరిగిపోతుంది. ఈ టైమ్‌లో నేను కారులో వెళ్తే అందరూ నన్ను ధనవంతుడని అనుకొంటారు. అప్పుడు వాడు రెండు రూపాయిలు తగ్గించడం కాదు కదా... ఐదు రూపాయిలు పెంచుతాడు... ఆ తరువాత నీ ఇష్టం !" అన్నాను.

"కరక్టేనండోయ్... మీకు ఆలస్యమవుతున్నట్టుంది. అసలే ఆస్తుల విషయంలో మీరు లాయర్‌ని కలవడానికి వెళ్తున్నారు" అని గుర్తుచేసింది.

'అది నిజమే కదా' అనుకుని నేను బస్ స్టాప్ కి బయలుదేరాను.

సూర్యుడి ధాటికి ఎక్కడ వడ కొట్టి కింద పడిపోతానో అని భయంగా ఉంది. హు..ఏం చేస్తాం.. ఒకప్పుడు వడ కొడుతుందని భయపడి జేబులో ఉల్లిపాయలు పెట్టుకుని తిరిగేవాళ్ళం... ఇప్పుడు ఉల్లిపాయలకి భయపడి ఎండలో తిరగడం మానేస్తున్నాం! 'ఎండకి తట్టుకోలేక పోతున్నాను ఏ బస్ వస్తే ఆ బస్ ఎక్కేయాలి... ఇంక నా వల్ల కాదు' అని అనుకుంటుండగా, బస్ వచ్చింది. వరదల్లో కొట్టుకుపోయిన వాళ్ళకి తిండి దొరికితే పరిగెట్టినట్టు, అందరూ బస్ వెనకాల పరుగులు తియ్యడం మొదలుపెట్టారు. ఆ జనసమూహంలో ఎలాగో అలా బస్సులో నీడ వైపున కూర్చోవాలని లోపలికెళ్లేసరికి నాకు ఆశ్చర్యమేసింది. ఎందుకంటే అందరూ ఎండ వైపు కూర్చోవడానికి కొట్టుకుంటున్నారు. పిచ్చిగా నవ్వుకుని నీడ వైపు దర్జాగా కూర్చున్నాను. కాసేపయ్యాక చూసేసరికి సీట్ దొరకని వాళ్ళందరూ మరో వైపు కూర్చోకుండా దిగిపోవడం మొదలుపెట్టారు. ఇక నాకు నవ్వు ఆగలేదు. పగలబడి నవ్వడంతో అక్కడున్న వాళ్ళందరు నన్ను చూడసాగారు. బస్ బయలుదేరింది. నేనున్న వరుసలో నేను తప్ప ఇంకెవ్వరూ లేరు. ఆఖరికి కండక్టర్ కూడా అటుపక్క ఇరుగ్గా కూర్చున్నాడు. ఎండకి వీళ్ళ మతి పోయిందనుకున్నాను. అప్పుడే బస్ "U-టర్న్" తీసుకుంది. ఎండ నావైపొచ్చింది. నా గూబ పగలకొట్టినట్టనిపించింది. పక్కన చూసేసరికి అటుపక్కవాళ్ళందరూ నా వైపే వెటకారంగా చూస్తూ నవ్వసాగారు. నాకేం చెయ్యాలో తెలియక మొహం దాచుకోవడానికి ప్రయత్నించాను. ఇంతలో కండక్టర్ వస్తే టికెట్ అడిగాను. అతను వెంటనే టికెట్ ఇచ్చి పన్నెండు రూపాయలడిగాడు.

"అదేంటి ??? టికెట్ తొమ్మిది రూపాయలే కద ? పెట్రోల్ ధరలు పెరిగాయని మేము బస్సుల్లో వస్తుంటే, మీరే ఇలా చేస్తే ఎలా సార్ ?" అని అడిగాను బాధగా.

"అచ్చా...మరి బస్ దేంతో నడుస్తుందో !" అని నాకో కౌంటరేసాడు.

చేసేదేంలేక గంట సేపు ఆ ఎండలోనే కూర్చుందామని నిశ్చయించుకున్నాను. కాసేపయిన తర్వాత ఒకడు బస్ ఎక్కి నా పక్కన

దిగులుగా కుర్చున్నాడు.

"నాకు తెలుసు. ఎండలో గంట సేపు ప్రయాణించడం కష్టమే !" అన్నాను.

"నేను దాని గురించి బాధ పడట్లేదు !" అని అన్నాడు.

"మరి?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"నిన్న మా ఇంట్లో దొంగలుపడ్డారు !" అన్నాడు.

"అయ్యో.." అన్నాను.

"దొంగాడు మా ఇంట్లోని అతి విలువైన వస్తువులని దొంగలించాడు!" అన్నాడు ఏడుస్తూ.

"ప్చ్.....ఏమిటవి?" అని అడిగాను.

"రెండు కేజీల ఉల్లిపాయలు" అని అన్నాడు కర్చీఫ్ తో కన్నీళ్ళని తుడుచుకుంటు.

"అయ్యయ్యో... మరి ఇప్పుడు ఎక్కడికెళ్తున్నారు ?" అని అడిగాను.

"అణుపురం గోల్డ్ లోన్ దగ్గరికి... ఆ డబ్బులతో ఉల్లిపాయలు కొనుక్కుని ఇంటికెళ్తాను!" అని చెప్పాడు.

'హు...ఇప్పుడైతే బంగారాన్ని తాకట్టు పెట్టి ఉలిపాయలు కొనుక్కోవాల్సొస్తుంది... ఇక ముందైతే ఉలిపాయల్ని తాకట్టు పెట్టి

బంగారం కొనాల్సొస్తుందేమో!’ అని నాలో నేనే అనుకున్నాను.

స్టాప్ వచ్చేంతవరకు ఒకరి బాధల్ని ఇంకోళ్ళతో పంచుకున్నాం. బస్ దిగంగానే నేను కిరాణా కొట్టుకి వెళ్ళాను. అక్కడ ఉల్లిపాయలు తీస్కున్న వెంటనే లాయర్‌ని కలవడానికి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి ముట ముటలాడే ఆయన మొహంలో మొట్టమొదటి సారి చిరునవ్వుని చూశాను. అతను వెంటనే నన్ను కూర్చోపెట్టి మర్యాద చెయ్యడంతో నేను ఆశ్చర్యపోయాను.

"సారీ సర్... ఉల్లిపాయలు కొనుక్కుని వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది !" అన్నాను.

"మీరు ఉల్లిపాయలు కొనడమేమిటండి?? అసలు మీ చరిత్ర మీకు తెలీదు!" అన్నాడతడు.

"నాకు చరిత్రా?" అని నవ్వి ఊరుకున్నాను.

"ముందు ఒకటి చెప్పండి. మీకు వచ్చే లాభంలో నాకో ఇరవై శాతం ఇస్తారు కదా!" అని అడిగాడు ఆశగా.

"అసలంటూ లాభం వస్తే ఇరవై ఏంటిలే కాని, ఇరవై ఐదు తీస్కో!" అని అన్నాను దర్జాగా.

"సార్... సార్... నా జన్మ ధన్యమైంది... మీ నాన్నగారికి ఐదు ఎకరాల ఉల్లి తోట ఉందండీ... ఇప్పుడే మీ దస్తావేజులు పరిశీలించాను!" అని అన్నాడు ఆనందంతో.

ఈ మాట వినడంతోనే మేము ఇద్దరం అరుస్తూ... ఈలేసుకుంటూ... ఆనందంతో డాన్స్ వేయడం మొదలుపెట్టాం. దెబ్బకి నేనో లక్షాది కారిని అయిపోయాను. ఆ లాయర్ కూడా కొత్త బిజినెస్ స్టార్ట్ చేస్కుని జీవితాన్ని అనుభూతిస్తాడట. ఉల్లిపాయలు తీసుకొస్తానని ఎదురు చూస్తున్న నా భార్య కి ఉల్లితోట వార్తని తీసుకెళ్ళడంతో తను సంతోషం పట్టలేకపోయింది. దీనికంతటికి కారణం మా నాన్నగారు. అప్పట్లో బ్రతుకు బండిని నడిపించడానికి తీసుకున్న నిర్ణయం ఇప్పుడు నా బ్రతుకు బండిని నడిపించడం

మాత్రమే కాదు, పరిగెట్టిస్తూంది. ఎవరికైనా ఉల్లిపాయలు కోస్తే ఏడుపొస్తుంది, కాని మాకప్పటినుంచి ఉల్లిపాయల్ని కోస్తే ఆనందబాష్పాలు జల జల రాలుతున్నాయి. అలా ఓ వార్త మా తలరాతనే మార్చేసింది.

***




"ఇఫ్ ఐ డోంట్ టాక్ టు యూ నౌ, మై మైండ్ వుడ్ బ్లాస్ట్." అంతవరకు, ఆఫీసు పని మీద దృష్టి పెట్టలేక తల పట్టుకుని కూచున్న నితిన్, కుర్చీని వెనక్కి తోసి, విసురుగా లేచాడు.

కేఫిటేరియా లాంజ్ లోకి వెళ్ళి మొబైల్ లోంచి స్నిగ్ధ కి ఫోన్ చేసాడు.

"హలో ..." ఎప్పటిలాగే నిరాశక్తంగా వినబడిందామె గొంతు.

"స్నిగ్ధా. నేను వెంటనే నిన్ను కలవాలి. ఒక్కసారి కేంటిన్ కి రా ప్లీజ్."

"ప్రొజెక్ట్ లో పని చాలా ఎక్కువుంది నితిన్. పని వదిలేసి కేంటిన్ లో కూచోవడం మా మేనేజర్ చూస్తే బావుండదు." అంతే, ఆ పైన తన మాటలేవీ వినకుండా ఫోన్ కట్ చేసేసింది. మూగబోయిన మొబైల్ వైపు చూస్తున్న నితిన్ కళ్ళలో సన్నగా నీళ్ళు తిరిగాయి.

అద్దంలోంచి బయట కనిపిస్తున్న చెట్ల వైపు చూశాడు.

గత ఆరు నెలలుగా ఎందుకిలా తనను దూరం చేస్తోంది స్నిగ్ధ? ఎనిమిదేళ్ళ స్నేహం, ప్రేమ. ఇంటర్ నుంచీ తామిద్దరూ క్లాస్ మేట్స్. ఇళ్ళు కూడా దగ్గరే. అప్పటినుంచి తామిద్దరికీ మంచి స్నేహం కుదిరింది. ఇంటర్ లో ఎంసెట్ ప్రాక్టీస్ అనీ, డౌట్స్ అనీ ఇద్దరూ ఒకళ్ళింట్లో ఒకళ్ళు కలుసుకుని చదువుకునేవారు. ఆ తరువాత అదృష్టం కొద్దీ ఒకే కాలేజీలో కంప్యూటర్స్ లో బి.టెక్ చెయ్యడం, ఇద్దరికీ కాంపస్ ఇంటర్వ్యూ లో ఒకే కంపెనీలో ఉద్యోగం రావడం అన్నీ తమ మధ్య స్నేహాన్ని మరింత బలపరిచాయి. ఉద్యోగం లో చేరాక కొత్త ఆలోచనలు మొగ్గ తొడిగాయి. ఒకరికొకరు చెప్పుకోకుండానే పరస్పరమైన ఇష్టం అవగతమైంది. మంచి ముహూర్తం చూసి తను స్నిగ్ధ కి ప్రేమ గురించి వ్యక్తపరచడం, తను ఒప్పుకోవడం, ఇద్దరి ఇళ్ళలోనూ ఎవరికీ ఏ అభ్యంతరాలూ లేకపోవడం, అన్నీ అలా సంతోషంగా జరిగిపోయాయి.

వచ్చే ఏడాది పెళ్ళిచేద్దామని పెద్దవాళ్ళు నిర్ణయించిన కొన్ని నెలలకే స్నిగ్ధలో కొత్త మార్పు చోటుచేసుకుంది. ఎందుకో తెలీదు, మాటలు తగ్గించింది. క్రమంగా కలవడం తగ్గించింది. కారణం చెప్పదు. ఈ మధ్య తను ఎన్ని ఫోన్లు చేసినా ముభావంగా మాట్లాడి వెంటనే ఫోను పెట్టేస్తోంది.

నిన్న రాత్రి తను స్నిగ్ధ తల్లితో చాలా సేపు మాట్లాడి ఎలాగయినా విషయం తెలుసుకోమన్నాడు. ఇవాళ ఉందయం ఆగలేక అవిడకి ఫోన్ చేస్తే ' స్నిగ్ధ కి నువ్వంటే కోపం లేదు బాబూ. అసలు పెళ్ళే వద్దంటోంది. చాలా నచ్చజెప్పి చూశాం. కొన్నాళ్ళాగితే అదే దార్లో పడుతుందిలే' అన్న మాటలే తనను ప్రశాంతంగా ఆఫీసులో కూడా కూచోనివ్వలేదు.

నితిన్ ఒక నిర్ణయానికొచ్చినవాడిలా వెంటనే ఇంటికి వెళ్ళి వచ్చాడు. ఆ రోజు సాయంత్రం ఆఫీసు బయటే నిలబడి స్నిగ్ధ బయటికి వచ్చేదాకా ఎదురుచూసి ఆమె రాగానే ముందుకెళ్ళి నించున్నాడు. నితిన్ ని చూడగానే నవ్వీ నవ్వనట్టుగా చూసి చూపులు బస్ వైపు తిప్పేసింది స్నిగ్ధ.

"స్నిగ్ధా. నిన్ను ఇబ్బంది పెట్టాలని రాలేదు. ఈ పుస్తకం చూడు. ఇది నువ్వు ఇవాళే చదివి తీరాలి. ఇన్నేళ్ళ మన స్నేహానికైనా విలువిచ్చి ఈ పుస్తకాన్ని చదువుతావని ఆశిస్తున్నాను." అంటూ ఆమె చేతిలో ఒక అందమైన డైరీ పెట్టి స్నిగ్ధ సమాధానం కోసం కూడా ఎదురుచూడాకుండా వెనుతిరిగి వెళ్ళిపోయాడు నితిన్.

ఆ రాత్రి స్నిగ్ధ భోజనాలయ్యాక తన గదిలోకి వెళ్ళి నిర్లిప్తంగా ఆ డైరీ పేజీలు తిప్పింది.

నితిన్ అందమైన చేతివ్రాతలో రాసుంది.

"ఇవాళ జనవరి ఒకటి. కొత్త సంవత్సరం రోజైనా మళ్ళీ నా పాత స్నిగ్ధలా మనస్ఫూర్తిగా నాతో మాట్లాడుతుందనుకున్నాను...

స్నిగ్ధా... గత కొన్ని రోజులుగా నువ్వెందుకో నాతో సరిగ్గా మాట్లాడట్లేదు. కారణం తెలిస్తే కదా. నేను చేసిన ఏ చర్య వల్ల నీ మనసు గాయపడిందో అది మళ్ళీ చెయ్యకుండా ఉండగలను?"

జనవరి 2 : "స్నిగ్ధా ... కొత్త పండగలు, పుట్టిన రోజులే కాదు, ఎప్పుడైనా సరే, ఆఫీసు లేని సమయాల్లో నాకు నీ చెంత గడపటమే ఇష్టం."

జనవరి 16 : "స్నిగ్ధా ... ఎప్పుడైనా సరే నీకు మీ అమ్మా, నాన్న మీద బెంగ కలిగి వాళ్ళని చూడాలనిపిస్తే , నువ్వు నిరభ్యంతరంగా మీ ఇంటికి వెళ్ళొచ్చు. నా నుంచి కానీ, మా అమ్మ నుంచి కానీ నీకు ఏ విధమైన ఆంక్షలూ ఉండవు. పుట్టింటికి వెళ్ళేందుకు ఒకరి అనుమతి కోసం నువ్వు ఎదురుచూడాల్సిన పని లేదు."

ఫిబ్రవరి 10 : " స్నిగ్ధా... పెళ్ళయ్యాక ఈ ఇల్లు నీది. అది మాటల్లోనే ఉండిపోతుందనుకోకు. నీ ఇంటిని నీకు నచ్చినట్టు అలంకరించుకునే హక్కు నీకుంది. నేనో, అమ్మో నీ అభిరుచికి అడ్డు చెప్పము. అలాగే వాటికి మెరుగులు దిద్దడం కోసం మేమేమైనా సలహాలిస్తే అవి నువ్వు కూడా నీ ఇష్టాన్ని బట్టి స్వీకరించు. నచ్చకపోతే మానెయ్. అంతే కాని నీ అలోచనలు మాకిష్టం లేదనుకుని నీ మనసులో బాధ విత్తనాన్ని నాటుకోకు."

ఫిబ్రవరి 23 : "స్నిగ్ధా ... ఏ ఇద్దరి మనుషుల జీవన విధానమూ పూర్తిగా ఒకేలా ఉండదు. ఎవరికెవరూ తీసిపోరన్న నిజాన్ని గుర్తుంచుకుని ఒకరినొకరు గౌరవించుకునే చోట విమర్శలకు తావుండదు. అనవసరంగా పక్క వారిని విమర్శించడంలో నేను కూడా పూర్తి వ్యతిరేకిని."

మార్చి 4 : "స్నిగ్ధా ... పెళ్ళయ్యాక నువ్వు, నేను మన ఇద్దరి తల్లి తండ్రులకీ సమానమైన గౌరవాన్నివ్వాలి. ఆడపిల్లని కన్నంతమాత్రాన మీ అమ్మ, నాన్న ఏ రకంగానూ తక్కువ కాదు. ఎప్పుడూ వాళ్ళని కించపరిచే మాటలు మీ పరోక్షంలో అయినా మేము అనము అని నేను హామీ ఇస్తాను."

అలా అక్కడక్కడ పేజీల్లో అందమైన వ్రాతలో ఇంకా ఇలాంటివే చాలా ఉన్నాయి. నోరెళ్ళబెట్టి ఆ డైరీ మళ్ళీ మళ్ళీ చదివింది స్నిగ్ధ. తన మనసునేదో స్కాన్ చేసి చదివేసినట్టు ఎలా కనిపెట్టాగలిగాడు? అంతలోనే ఏదో చటుక్కున స్ఫురించింది. మొబైల్ తీసుకుని అక్క పల్లవి కి ఫోన్ చేసి విషయం చెప్పింది.

"స్నిగ్ధా. నువ్వూహించింది నిజమే. కొన్ని నెలల క్రితం ఓ రోజు నితిన్ నాకు ఫోన్ చేశాడు. చాలా సేపు మాట్లాడాడు. మా ఇంటికి వచ్చి ఒక పది రోజులుండి వెళ్ళినప్పటినుంచి నువ్వు కొంచం మూడీగా ఉండటం గమనించానని చెప్పాడు. తన గురించి ఎన్నో ఏళ్ళుగా తెలిసిన దాన్ని కాబట్టి, నేను మా అత్తగారింట్లో ఎప్పుడు బాధ కలిగినా నీతోనే పంచుకుంటానని తన దగ్గర ఒప్పుకున్నాను. అప్పటి నుంచి నేను నా సమస్యలేమైనా నీతో పంచుకున్న రోజున మాత్రం, చిత్రంగా నితిన్ కూడా నాకు ఫోన్ చేసేవాడు. 'ఇవాళ మీరేమైనా బాధపడ్డారా స్నిగ్ధ దగ్గర?' అని ఆడిగేవాడు. అసలు నా సమస్యలు నీకు చెప్పి తప్పు చేస్తున్నానేమో అనిపించింది. కానీ, తనేమన్నాడో తెలుసా. 'ఏ విషయాల వల్లనైతే స్నిగ్ధ పెళ్ళికి భయపడుతోందో, వీలైనంతవరకూ ఆ విషయాలు నాకు తెలిస్తే, పెళ్ళయ్యాక గొడవలు రాకుండా ముందే జాగ్రత్త పడొచ్చు. అమ్మాయిల ఆశలెలా ఉంటాయో కూడా తెలిస్తే భార్యని కన్నీరు కార్చకుండా చూసుకోవచ్చు. స్నిగ్ధ మూడీగా అయిపోయినప్పుడల్లా, తన ఫోను చూస్తే ఆఖరి ఫోన్ మీకే వచ్చి ఉండటం వల్ల, మీ సమస్యల్ని చూసే తను పెళ్ళికి భయపడుతోందేమో అని అనుమానిస్తున్నాను' అన్నాడు. నీ భయాలేమిటో తెలుసుకోవాలనే నాకు ఫోన్ చేసేవాడు. నితిన్ ఎలాంటివాడో నాకు తెలుసు కాబట్టి, ఎన్నో ఏళ్ళ పరిచయం కాబట్టి, నీకు చెప్పుకున్న విషయమే టూకీగా తనకి చెప్పేదాన్ని. ఇంతలా నీ సంతోషం కోసం తపించేవాడు ఇంకెవడూ నీకు దొరకడు. నితిన్ నిన్ను ప్రేమించడమే కాదు, జీవితాంతం నిన్ను కష్టపెట్టకుండా చూసుకోవాలని తపిస్తున్నాడు. జీవితానికో తోడు కావాలి. ఆ సరయిన తోడు నీకు నితినే."

అక్క మాటలు పదే పదే చెవిలో మోగుతుంటే డైరీ తీసుకుని ఆనందంగా నితిన్ ఇంటివైపు పరుగెత్తింది స్నిగ్ధ. తనెంత పొరబడింది? నితిన్ కూడా అందరిలాంటివాడే అనుకుంది. అక్క అమెరికాలో ఎం.ఎస్ చేసి వచ్చింది. తనని కోరి పెళ్ళిచేసుకున్నారు. అయినా అత్తారింట్లో ఎన్ని విషయాల్లోనో తన ఇష్టాల్ని వదులుకుని, బలవంతంగా సర్దుకుపోవాల్సిరావటం చూసి తనసలు పెళ్ళే వద్దనుకుంది. ఎన్నేళ్ళు ప్రేమించుకున్నా పెళ్ళయ్యాక నితిన్ కూడా మారిపోతాడని అనుమానించింది.

బహుశా, స్నిగ్ధ స్థితి అర్థమైందేమో. నితిన్ మనసెందుకో హటాత్తుగా సంతోషంలో గెంతులేసింది. గుమ్మంలో విరబూసిన రాధామనోహరాల్ని పలకరించడానికి బయటికి వచ్చిన నితిన్ కి వెన్నెల్లో తడుస్తూ తన వైపు పరుగెట్టుకొస్తున్న స్నిగ్ధ కనపడింది.

***




ఉదయం ఆరున్నరకే కాలింగ్ బెల్ మోగింది! "థూ... థూ..." అని ఛాతీ మీద ఊసుకున్నాడు సుబ్బారావ్! చలికి రగ్గు కప్పుకుని హాయిగా పడుకున్న అతనికి ఆదివారం పూట ఆ కాలింగ్ బెల్ ఉలికిపాటునే కాదు కోపాన్ని కూడా రప్పించింది.

'ఎవడ్రా పొద్దున్నే?' అని అడగాలనుకుని మంచం మీదనుండి గబగబా దిగే సరికి జారిపోయిన      లుంగీని ఎగలాక్కుని కట్టుకుని తలుపు తెరిచాడు.

ఎదురుగా పళ్ళికిలిస్తూ పలకరించారు నలుగురు వ్యక్తులు "గుడ్ మాణింగ్ సార్!" అంటూ ముక్త కంఠంతో!

'గూండాల్లా వచ్చి గుడ్ మాణింగ్ ఏంటో' అనుకుంటూ తల ఊపుతూ ఏమిటన్నట్టుగా చూసాడు సుబ్బారావ్.

"మేం కాలనీలో ఉన్న బ్యాంక్ నుండి వచ్చామండీ!" అన్నాడు వాళ్ళలో కాస్త పెద్దగా ఉన్నాయన కళ్ళజోడును సవరించుకుంటూ.

"నాకు అప్పులేం లేవండి!" ముక్తసరిగా చెప్పి తలుపు వేసెయ్యబోయాడు సుబ్బారావ్.

"అబ్బే బాకీల వసూళ్ళ కోసం కాదు సార్, మేం బయల్దేరింది..."

అందుకున్నాడు అతని వెనకే ఉన్న ఓ నడివయసాయన.

"నాకు క్రెడిట్ కార్డు కూడా వద్దు!" అన్నాడు సుబ్బారావ్ అతన్ని పూర్తిగా చెప్పనివ్వకుండానే.

"అది కూడా కాదు సార్. మా బ్యాంక్ లో మీరొక్క ఎకౌంట్ ఓపెన్ చేస్తారని అడిగేందుకొచ్చాం." అన్నాడు మరో ఇరవయ్యేళ్ళ కుర్రాడు పక్క నుండి.

"ఎకౌంట్ ఓపెన్ చెయ్యమని అడిగే పద్ధతి ఇదా? ఆదివారం హాయిగా పడుకున్న వాళ్ళను ఎలా పడితే అలా లేపేసి అడుగుతారా?!" విసుక్కున్నాడు సుబ్బారావ్. అతని మనసులో ఇందాక జారిపోయిన పైజామా జ్ఞాపకం ఇంకా మెదులుతూనే ఉంది!

"సారీ సార్! మా బ్యాంక్ వాళ్ళు దేశమంతా ఒకేసారి ప్రారంభించిన మహోత్తర ప్రచార కార్యక్రమంలో బాగంగా మీ ఫ్లాట్స్ కి వచ్చాం. ఇవాళంతా మాకిదే పని." మొట్టమొదటిగా పలకరించినతను చెప్పాడు.

"గవర్నమెంట్ బ్యాంకే అంటున్నారు. మీకు జీతాల్లేవా? ఇలా రోడ్డు మీద పడి అడుగుతున్నారేంటి? కొంపదీసి మీ బ్యాంక్ నష్టాల్లో

ఉందా?!" అనుమానంగా అడిగాడు సుబ్బారావ్.

వాళ్ళంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకునే సరికి సుబ్బారావ్ కి అనుమానం పెరిగిపోయింది. నలుగురూ తెల్లబోయి చూసినా అంతలోనే ఆ పెద్దాయనే తేరుకుని చెప్పాడు, "అదేం లేదండి, మా బ్యాంక్ చాలా పెద్ద బ్యాంక్. ఎకౌంట్స్ పెంచుకుందామని ఇలా వస్తున్నాం అంతే! నేను ఇక్కడి బ్రాంచ్ మేనేజర్ని."

"లేదండి నాకు మా శాలరీ ఎకౌంట్ వేరే ఉంది. ఎకౌంట్ అక్కర్లేదు." తలుపు వేసెయ్యబోయాడు.

"అలా అనకండి సార్. మా బ్యాంక్ లో సర్వీస్ చాలా బాగుంటుంది. ఒకసారి ఎకౌంట్ ఓపెన్ చేశాక మీకే తెలుస్తుంది. ఆ తర్వాత మీ శాలరీ అకౌంట్ కూడా మా దగ్గరికే మార్చేస్తారు. ఇంకా డిపాజిట్లు వేసుకోవచ్చు. లాకర్ తీసుకోవచ్చు... ఇంకా..." అంటూ పెద్ద చిట్టా విప్పాడు మరో కుర్రాడు.

వాళ్ళు అంత తేలిగ్గా వదిలేలా లేరని అర్థమైంది సుబ్బారావ్ కి. సబ్బులు, ఫినాయిలు అమ్మే వాళ్ళు బ్రతిమాలినట్టుగా ఈ బ్యాంక్ వాళ్లకు ఈ గతి పట్టిందేమిటో అనుకుంటూ, "సరే ఎకౌంట్ ఓపెనింగ్ ఫార్మ్ ఇవ్వండి. నాకు వీలైన రోజు వచ్చి చేస్తాను." అని చెప్పాడు.

వాళ్ళందరి ముఖాలు విప్పారిపోయాయి. "థాంక్స్ సార్, ఇదిగోండి ఫార్మ్. మీరు ఇవ్వాళ చేస్తానన్నా చేసెయ్యొచ్చు. అవసరమైన పేపర్స్ రేపివ్వొచ్చు. మీ పేరు, వివరాలు చెప్పండి." తన దగ్గరున్న నోట్ బుక్ రెడీగా పెట్టుకుని అడిగాడు రెండో కుర్రాడు.

ముఖం చిట్లించి అడిగాడు సుబ్బారావ్, "ఎలానూ వస్తాను కదా, మళ్ళీ ఇవన్నీ ఎందుకు?"

"ఎంత మందిని కలిసామో, ఎన్ని ఎకౌంట్స్ ఓపెన్ అవుతాయో సాయంత్రానికి మేం హెడ్డాఫీసుకు రిపోర్ట్ చెయ్యాలి సార్, చెప్పండి." బ్రతిమాలినట్టుగా అన్నాడు సుబ్బారావ్.

"చాలా థాంక్స్ సార్" అంటూ వెలిగిపోతున్న ముఖంతో షేక్ హ్యాండ్ ఇచ్చాడు మేనేజర్. అతని అనుచరులు అప్పటికే పక్క ఫ్లాట్

కాలింగ్ బెల్ నొక్కినట్టున్నారు, తలుపు మూయబోయిన సుబ్బారావ్ కి గయ్ మంటూ వినిపించింది పక్కింటావిడ పెద్ద నోరు, "బుద్ధుందా... ఆదివారం పూట పనిపాటా లేని సన్నాసుల్లా బయల్దేరారు... వెళ్ళండి వెళ్ళండి... బ్యాంకట బ్యాంక్. సెలవు పూట అందరి పనులూ పాడు చేస్తూ!"

తర్వాతి రోజు తెల్లవారుతూనే సుబ్బారావ్ సెల్ మోగింది. "సార్ నేను ఫలానా బ్యాంక్ నుండి సతీష్ ని మాట్లాడుతున్నా. నిన్న ఆదివారం మీ బ్యాంక్ కి వచ్చాం. మా బ్యాంక్ లో ఎకౌంట్ తీసుకుంటానన్నారు కదా, ఎప్పుడొస్తున్నారు?"

'ఏమిటో వీళ్ళు అప్పుడే ఫోల్లో ఫాలో అప్ కూడా మొదలు పెట్టేసారు' అనుకుంటూ చెప్పాడు సుబ్బారావ్, "రేపో ఎల్లుండో వస్తాను. నాకూ కుదరాలి కదా?!"

ఆ ఫోన్ ముగించగానే మరో సారి మోగింది. ఎత్తగానే వినవచ్చిందిలా, "నమస్కారం సుబ్బారావ్ గారూ, నిన్న మీ ఇంటికొచ్చాం. మీరు ఎకౌంట్ ఒకటి ఇస్తానన్నారు కదా, అది గుర్తుచేద్దాం అని నేను మేనేజర్ని చేస్తున్నా."

"తప్పకుండా ఇస్తాను సార్, నాకు వీలు చూసుకుని వస్తాను." సుబ్బారావ్ చెప్పాడు.

ఆ కాల్ అయిన రెండు నిమిషాలకే మళ్ళీ మోగింది ఫోన్. "గుడ్ మార్నింగ్ సర్, నేను ప్రదీప్ ను మాట్లాడుతున్నా. మీరు మా ఫలానా బ్యాంక్ కి ఎప్పుడొస్తున్నారు, ఎకౌంట్ తీసుకుంటానన్నారు కదా?!"

చిర్రెత్తుకొచ్చింది సుబ్బారావ్ కి. "ప్రదీప్ గారూ, ఎంతమంది చేస్తారు ఒకే మనిషికి మీ బ్యాంక్ వాళ్ళు?! ఇప్పటికి మూడో ఫోన్ మీ వాళ్ళనుండి!" విసురుగా చెప్పాడు సుబ్బారావ్.

"సారీ సార్! మీరు వచ్చినప్పుడు నా దగ్గరికే రండి ప్లీజ్" అంటూ ఫోన్ పెట్టేసాడు ప్రదీప్.

ఆ రోజు మధ్యాహ్నానికల్లా దాదాపు ముప్పై కాల్స్ ఆ బ్యాంక్ సిబ్బంది నుండే అందుకున్నాడు సుబ్బారావ్. చివరకు కోపంతో ఫోన్ కూడా స్విచ్చాఫ్ చేసేసాడు.

తర్వాతి రోజు ఉదయం నుండి మళ్ళీ మొదలైన ఫోన్ దాడికి తట్టుకోలేక ఆఫీస్ లో పర్మిషన్ అడిగి ఆ ఫలానా బ్యాంక్ కి వెళ్ళాడు. అతన్ని చూడగానే ఆదివారం వచ్చిన కుర్రాళ్ళు ఇద్దరూ పలకరించారు. పేపర్స్ అన్నీ అతని చేతిలోంచి లాక్కున్నట్టుగా తీసుకుని, అన్నీ చూసి తలాడించి, "మీరు సాయంత్రం రండి సార్! మీ పాస్ బుక్, ఏటీయం కార్డ్ అన్నీ రెడీ చేసి ఉంచుతాను." అని చెప్పాడు ప్రదీప్.

సాయంత్రం ఆఫీస్ నుండి వస్తూ బ్యాంక్ కి వెళ్ళాడు సుబ్బారావ్.

అతన్ని చూసిన ప్రదీప్, "పాస్ బుక్ ప్రింటర్ ఏదో ప్రాబ్లం వచ్చి ఆగిపోయింది. రేపొస్తే ఏటియం కార్డ్ తో సహా కలిపి ఇచ్చేస్తాను సర్! ఏమీ అనుకోకండి" అన్నాడు ప్రదీప్.

రెండో రోజు వెళ్ళాడు సుబ్బారావ్. ఎకౌంట్ ఓపెన్ చేసినపుడు అతని దగ్గరికి వెళ్ళలేదని కోపమో ఏమో, అతన్ని చూస్తూనే సతీష్ ముఖం తిప్పుకున్నాడు. 'అత్తాకోడళ్ళలా బ్యాంక్ లో ఈ గొడవలు, పోటీలు ఏంటో ' అనుకుంటూ సతీష్ దగ్గరగా వెళ్ళి అడిగాడు, "ప్రదీప్ లేడా?"

ముక్తసరిగా చెప్పాడు సతీష్, "లేడండీ, ఏదో పనుందని వెళ్ళిపోయాడు."

"పాస్ బుక్, ఏటీయం కార్డ్ సాయంత్రం ఇస్తానన్నాడు. తయారయ్యాయా?" సుబ్బారావ్ అడిగాడు.

"ఏమోనండి. అతనికే తెలుస్తుంది. రేపు ప్రదీప్ దగ్గరకు వచ్చి తీసుకోండి." అదే తీరుగా సమాధానం చెప్పాడు సతీష్.

మేనేజర్ ఏమైనా సాయం చేస్తాడేమో అన్నట్టుగా వెళ్తూ ఆయన క్యాబిన్లోకి చూసాడు సుబ్బారావ్. తెచ్చి పెట్టుకున్న నవ్వు ముఖంతో రుబ్బురోలు పొత్రం లా బుర్ర, పూనకంలో వేపమండల్లా చెయ్యి ఊపాడు తప్ప బైటకు మాత్రం రాలేదాయన.

చేసేదేం లేక ఆ తర్వాతి రోజు మళ్ళీ బ్యాంక్ కి వెళ్ళాడు సుబ్బారావ్. అతని అదృష్టం కొద్దీ ప్రదీప్ ఉన్నాడు. కార్డ్, పాస్ బుక్ అతనికిచ్చి చెప్పాడు ప్రదీప్, "కార్డ్ పక్కనే ఉన్న ఏటీయం లో మీరొక్కసారి పెట్టగానే మీకొచ్చిన కోడ్ మార్చుకోవచ్చు."

ఏటీయం లోకి వెళ్ళి రెండు నిమిషాల్లోనే తిరిగి వచ్చి చెప్పాడు సుబ్బారావ్, 'కార్డ్ ఇంకా ఆక్టివేట్ అవ్వలేదని వస్తోంది" ప్రదీప్ కి రసీదు చూపిస్తూ.

కంప్యూటర్లో ఏదో చూసి చెప్పాడు ప్రదీప్, "ఇంకా ప్రోసెస్ లో ఉన్నట్టుండి సార్, రేపు మళ్ళీ ఏటీయం లో పెట్టి చూడండి!"

ఆ తర్వాతి రెండు రోజులూ సుబ్బారావ్ ఏటీయం కి, అక్కణ్ణుంచి బ్యాంక్ లోపల ప్రదీప్ దగ్గరకు వెళ్ళడం, మొత్తానికి మూడో రోజునుండి కార్డ్ పని చెయ్యడం జరగడంతో చివరకు 'హమ్మయ్య' అని నిట్టూర్చాడు సుబ్బారావ్.

వారం తర్వాత సుబ్బారావ్ మళ్ళీ వచ్చాడు ప్రదీప్ దగ్గరకు, "కార్డ్ ఏటీయం మిషన్ లోపలకు వెళ్ళిపోయింది. వచ్చి తీసి ఇస్తారా?" అంటూ.

"కోడ్ అంటే పాస్ వర్డ్ టైప్ చేసేటప్పుడు మీరు తేడాగా చేసినా, ఆలస్యం చేసినా కార్డును మెషిన్ తీసేసుకుంటుంది." ప్రదీప్ చెప్పాడు.

"మిగతా బ్యాంకుల్లో అలా లేదు. అసలు కార్డ్ ఇలా పెట్టి అలా తీసేస్తే చాలు." సుబ్బారావ్ అన్నాడు.

"మా బ్యాంక్ లో ఇదే పద్ధతి" చాలా గొప్ప పద్ధతి అన్నట్టుగా సగర్వంగా అన్నాడు ప్రదీప్.

"సరే, కార్డ్ తీసి ఇస్తే వెళ్తాను." సుబ్బారావ్ విసుక్కున్నాడు.

"లేదు సర్. ఏటీయం వేరే వాళ్ళు చూసుకుంటారు. వాళ్ళు వచ్చి డబ్బు పెట్టేటప్పుడు కార్డ్ తీసి ఇస్తారు. రేపు సాయంత్రం రండి." తాపీగా అన్నాడు ప్రదీప్.

"మీ బ్యాంక్ ఏటీయమ్మే కదా ఎవరో వచ్చి కార్డ్ తీసి ఇవ్వడం ఏంటి? మీకు తెరిచే వీలుండదా?!" సుబ్బారావ్ కోపంగా అడిగాడు.

"లేదండీ మా బ్యాంక్ వాళ్ళకు అవుట్ సోర్సింగ్ అంటే కాంట్రాక్ట్ కి ఇచ్చేసింది. మాకు సంబంధం ఏమీ ఉండదు." ఇంకా తాపీగా చెప్పాడు ప్రదీప్.

సుబ్బారావు కి ఒళ్ళు మండిపోయినా ఎలానో తమాయించుకుని వెళ్ళి తర్వాతి రోజు కార్డ్ తీసుకుని వెళ్ళాడు.

మరో పదిరోజులకల్లా పరుగులు పెడుతూ ప్రదీప్ దగ్గరకొచ్చాడు సుబ్బారావ్. "ప్రదీప్, ఎకౌంట్లో ఉన్న పదివేల రూపాయలూ ఏటీయం నుండి తీసుకుందామంటే ఎకౌంట్లో తగ్గిపోయాయి కానీ నాకు డబ్బు రాలేదు." కంగారుగా చెప్పాడు.

"ఫర్వాలేదు మళ్ళీ మీకొచ్చేస్తాయ్!" అభయమిచ్చాడు ప్రదీప్.

"వచ్చేస్తాయా… ఎప్పుడు ఎలా?" అయోమయంగా అడిగాడు సుబ్బారావ్.

"తిరిగి మీ ఎకౌంట్లోకి పడిపోతాయిలెండి." నమ్మకంగా చెప్పాడు ప్రదీప్.

"ఎప్పటికి?" ఆదుర్దాగా అన్నాడు సుబ్బారావ్.

"ఎప్పటికి అంటే ఏమీ చెప్పలేం. కాసేపాగి పడిపోవచ్చు. లేదా రేపో ఎల్లుండో." ప్రదీప్ జవాబుకి సుబ్బారావ్ మతి పోయింది.

"అన్ని రోజులు పడితే ఎలా? నాకిప్పుడు డబ్బులు కావాలి." సుబ్బారావ్ చెప్పాడు.

"మీ ఎకౌంట్లో డబ్బులు లేవుగా? ఎలా తీస్తారు?" తిరిగి ప్రశ్నించాడు ప్రదీప్.

"డబ్బులు నాకు ఏటీయం ఇవ్వలేదుగా?!" సుబ్బారావ్ ఎదురు ప్రశ్నించాడు.

"కానీ ఎకౌంట్లో తగ్గిపోయాయిగా?!"

"అది మీ తప్పేగా! ఎలానూ తర్వాత వచ్చేస్తాయి అంటున్నారు కదా. ఇక్కడ తీసుకునే ఏర్పాటు చెయ్యాలిగా?!" కోపంగా అడిగాడు సుబ్బారావ్.

"అలా వీలు కాదు సార్. ఎకౌంట్లో ఉంటేనే మీకు ఇక్కడ క్యాష్ ఇవ్వగలం" ప్రదీప్ తాపీగా చెప్తుంటే తారాస్థాయిని అందుకుంటుంది సుబ్బారావ్ కోపం. కానీ అవసరం తనది. దానికి తోడు పోయిన పదివేలు ఎలా వస్తాయో అని బెంగ కూడా పట్టుకుంది కొత్తగా. ఆ బెంగలోనే అడిగాడు నీరసంగా, "ఒకవేళ మూడు రోజుల తర్వాత కూడా రాకపోతే ఏం చెయ్యాలి?!"

"కంప్లయింట్ రాసివ్వాలి మీరు. అప్పుడు నేను మా హెడ్డాఫీస్ కి మెయిల్ పెడతాను." ప్రదీప్ జవాబిచ్చాడు.

"మరి ఆ మెయిలేదో ఇప్పుడు పెడితే నా డబ్బు నాకు వచ్చేస్తుంది కదా!" అర్థింపుగా అడిగాడు సుబ్బారావ్.

"మూడు రోజులవకుండా మెయిల్ పెట్టడానికి మాకు పర్మిషన్ లేదు సార్!" నిర్మొహమాటంగా చెప్పాడు ప్రదీప్.

మేనేజర్ని కలిసాడు సుబ్బారావ్. ఆయన కూడా వీలుకాదని చెప్పడంతో నిరాశాగా వెళ్ళిపోయాడు. పైగా ఓ ఉచిత సలహా పారేశాడు, శాలరీ ఎకౌంట్ ఇక్కడకు మార్చేసుకుంటే అప్పుడు తన సహాయం చెయ్యగలిగే వాడినని.

ఆ తర్వాత పదిరోజులకు గానీ సుబ్బారావ్ డబ్బులు అతని ఎకౌంట్లోకి రాలేదు.

మరో నెల తర్వాత బ్యాంక్ కి వచ్చాడు సుబ్బారావ్. "ప్రదీప్, ఏటీయం లో జనరేటర్ లేదా? డబ్బు తీసుకుంటూ ఉండగా మధ్యలో

ఏటీయం కరెంట్ పోయి ఆగిపోయింది." గాభరాగా అడిగాడు.

"లేదండీ, దానికి యూపీయస్ ప్రాబ్లం ఉంది. మేం కంప్లయింట్ ఇచ్చాం. త్వరలో పెడతామని చెప్తున్నారు."

'వీడి నిదానం తగలెట్టా' అనుకున్నాడు సుబ్బారావ్, ప్రదీప్ సమాధానం విని.

"మరి ఈలోగా కరెంట్ వస్తే?" సందేహంగా అడిగాడు సుబ్బారావ్.

"అందుకే మీరు ఏటీయం దగ్గరే ఉండండి. కరెంట్ వచ్చాక మీ డబ్బు వచ్చేస్తే వచ్చెయ్యొచ్చు. వేరే ఎవరైనా వస్తే మీకు ప్రాబ్లం కదా! అందుకని కరెంట్ వచ్చే వరకూ అక్కడే ఉండి ఇంకెవ్వరూ ఏటీయం ముట్టుకోకుండా చూసుకోండి!" సతీష్ హెచ్చరికకు ఏటీయం లోకి పరుగుపెట్టాడు సుబ్బారావ్.

ఆ రోజు ఆ ప్రాంతంలో నాలుగు గంటల పాటు కరెంట్ పోయింది. ఆఫీసుకు సెలవు పెట్టి కరెంట్ వచ్చే వరకూ ఏటీయంలో నిలబడి చెమటలు కార్చుకుంటూ కాపలా కాసాడు సుబ్బారావ్. కరెంట్ వచ్చింది కాని ఏటీయం పని చెయ్యలేదు. మళ్ళీ ప్రదీప్ దగ్గరకు పరుగు పెట్టాడు.

"దానికి బ్యాక్ అప్ లేదు కదా. ఓ పావుగంట పడుతుంది స్టార్ట్ అవ్వడానికి. మిమల్ని అక్కడే ఉండమన్నా కదా!" ప్రదీప్ దబాయింపుకి నిర్ఘాంతపోయి మళ్ళీ ఏటీయంలోకి పరుగు తీసాడు సుబ్బారావ్.

మరో అరగంటకు చచ్చి చెడి ఏటీయం స్టార్ట్ అవ్వగానే సుబ్బారావ్ డబ్బులు సుబ్బారావ్ కి వచ్చేసాయి. 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ ఏటీయం లోంచి బైటకు వచ్చి చెమటలు తుడుచుకున్నాడు సుబ్బారావ్.

తన స్కూటర్ దగ్గరకు వచ్చి కాసేపు దాని మీద కూర్చుని రిలాక్స్ అయ్యాడు సుబ్బారావ్. తళుక్కుమంటూ ఒక ఆలోచన రావడంతో బండిలో ఉన్న బ్యాంక్ పాస్ బుక్ బైటకు తీసాడు. లోపలకు వెళ్ళాడు. అక్కడ సీట్లలో ఎవ్వరూ లేరు.

"రెండు నుంచి లంచ్ అవర్ సార్! కాసేపు కూర్చోండి" లోపల నుండి వచ్చిన ఆఫీస్ బాయ్ చెప్పాడు. చాలాసేపు కూర్చున్నా ఎవరూ రాలేదు. అనుమానం వచ్చి బైటకు వెళ్లి బోర్డు చూసి వచ్చాడు. అరగంట సేపు లంచ్ అవర్. మూడు గంటలు కావొస్తుండగా తీరిగ్గా, విలాసంగా సీట్లలోకి వచ్చి కూర్చున్నారు సిబ్బంది. ప్రదీప్ దగ్గరకు వెళ్ళాడు. చెప్పమన్నట్టుగా చూసాడు ప్రదీప్.

"ఎకౌంట్ క్లోజ్ చేసేస్తాను." పాస్ బుక్ కూడా ఇస్తూ చెప్పాడు.

"మధ్యాహ్నం ఎకౌంట్ క్లోజ్ అవ్వదు సార్, ఉదయాన్నే రావాలి." ప్రదీప్ చెప్పాడు.

"చూసావుగా ఉదయం నుండి ఎన్ని బాధలు పడుతున్నానో?!" సుబ్బారావు కోపంగా అన్నాడు.

"సరే, మేనేజర్ గారికి ఒక లెటర్ రాసి ఇచ్చి ఆయన సంతకం దాని మీద పెట్టించుకుని రండి." దయతలిచాడు ప్రదీప్.

రిక్వెస్ట్ లెటర్ రాసి మేనేజర్ని కలిసాడు. "ఇంత మంచి ఎకౌంట్ వదులుకోవడం మాకు బాధగానే ఉంది" అంటూ బోలెడు విచారాన్ని పులుముకుంటూ పాస్ బుక్ ని, ఏటీయం కార్డునూ ప్రదీప్ దగ్గరకు పంపించాడు మేనేజర్.

మరో అయిదు నిమిషాల్లో ప్రదీప్ లోపలకు వచ్చాడు. మేనేజర్ వైపు చూస్తూ "సుబ్బారావ్ గారి ఎకౌంట్లో కనీస మొత్తం లేకపోవడం వల్ల రెండు నెలలకు రెండు వందలు కట్టయిపోయాయి సార్. ఎకౌంట్లో వందే మిగిలింది. ఎకౌంట్ క్లోజింగ్ చార్జెస్ నూట యాభై తీసుకోవాలి. ఆయన ఎకౌంట్లో ఒక యాభై కడితే ఎకౌంట్ క్లోజ్ అయిపోతుంది." తాపీగా చెప్పాడు.

ఆ మాటలు విన్న సుబ్బారావ్ కోపంతో పిచ్చెక్కి పోయాడు. "అసలు నాకు ఎకౌంట్ కావాలని మీ దగ్గరకు నేనొచ్చానా? మీరే వచ్చి ఓపెన్ చెయ్యమని బ్రతిమాలారు. వచ్చాక ఎన్నిసార్లు పాస్ బుక్ కోసం, ఏటీయం కార్డు కోసం ఎన్నిసార్లు తిరిగాను? అసలు మీ దరిద్రపుగొట్టు సర్వీసుకు విసిగిపోయే నేను ఎకౌంట్ క్లోజ్ చేద్దామని నిర్ణయించుకున్నా. పైసా కట్టను. ఏంచేసుకుంటారో చేసుకోండి. నీ..." తన్నుకొస్తున్న బూతులను ఆపుకుంటూ విసురుగా కుర్చీని వెనక్కి జరిపి బ్యాంక్ బైటకు నడిచాడు సుబ్బారావ్.

ఇప్పుడు అతని మనసెంతో ప్రశాంతంగా ఉంది, ఎకౌంట్ క్లోజ్ చేసినందుకు కాదు, శాలరీ ఎకౌంట్ ఆ బ్యాంక్ కి మార్చుకోనందుకు!

***




జీవితం చాలా అందమైనది, అపురూపమైనది. ప్రతి క్షణాన్ని అద్భుతంగా ఆస్వాదించే అవకాశం కేవలం మనిషికే ఇచ్చాడు ఆ భగవంతుడు. కానీ చాలామంది అనేకానేక వ్యామోహాల్లో పడి జీవితాన్ని అర్ధరహితంగా, తేజోహీనం గా చేసుకుంటున్నారు. ఇంద్రధనస్సు లాంటి సుందరమైన జీవితాన్ని చేతులారా అంధకార బంధురం చేసుకొని  సంధ్యాసమయం లో పశ్చాత్తాపపడే నా బోటి వాడికి  నిష్కృతి ఏది? ఎంతసేపూ కొత్త కొత్త ప్రయోగాలు చేసుకుంటూ మెటీరియలిస్టు గానే బతికా గాని ప్రేమ, ఆత్మీయత, ఓరిమి, సంతృప్తి అనేవాటికి అర్ధం తెలుసుకునే ప్రయత్నం ఏనాడు చేశాను గనుక? ఇదీ ఒంటరితనం తో క్రుంగిపోతూ చరమాంకం లో నైరాశ్యం తో కొట్టుమిట్టాడుతున్న డా. భానుప్రసాద్ మనోగతం.

బ్రస్సెల్స్ లో విశాలమైన నా ఫ్లాట్ అద్దాల కిటికీ ల్లోంచి సమీపంలోని పార్క్ కన్నుల విందుగా పిల్లలతో, పావురాలతో సందడిగా ఉంది. సాయంత్రం అవుతూనే ఫ్లాట్స్ లో ఉండే వాళ్ళంతా బిలబిల్లాడుతూ అక్కడికి చేరతారు. ఆడ మగ అన్ని వయసుల వాళ్ళూ సేద తీరతారు. పసిపిల్లల్ని ప్రామ్స్ లో తీసుకొని వస్తారు కొందరు. ముసలివాళ్లు పిల్లల అల్లర్లని ఆనందం గా వీక్షిస్తూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. ఇన్నేళ్లల్లో నేనెప్పుడూ అక్కడికి వెళ్లింది లేదు, ఎవరితో మాట్లాడిందీ లేదు. మనుషుల కంటే మెషీన్ల తో

ఎక్కువగా గడపడం వల్లనేమో మెకానికల్ గా తయారయ్యాననిపిస్తుంది ఒక్కోసారి. ఫ్లాట్ తాళం వేసి కార్ లో నేనెప్పుడూ వెళ్ళే "ద పారిస్" రెస్టారెంట్ కి వెళ్ళి నాకిష్టమైన బీర్ ఆర్డర్ చేసి ఆలోచనల్లోకి జారాను.

అమ్మానాన్నలకి నేను, చెల్లి ఇద్దరే సంతానం. వంశోద్ధారకుడినని ఎంతో ముద్దుగా ఆడింది ఆట గా పాడింది పాట గా పెంచారు. నాన్న చిరుద్యోగి అయినా చదువులో తన ప్రతిభ గమనించి స్థాయికి మించిన ఖర్చుతో ఇంజనీరింగ్ చదివించారు. తర్వాత ఉద్యోగం చేస్తానని వాళ్ళకి ఆసరా అవుతానని కలలు కూడా కనే ఉంటారు. కాని తనేం చేశాడు? ఎమ్మెస్ కి ఎయిడ్ రావడంతో అమెరికా వెళ్తానని పట్టుపట్టాడు. తలకి మించిన భారమే అయినా తల్లి తనకున్న కొద్దిపాటి బంగారాన్ని అమ్మేసి టికెట్లకి డబ్బు సమకూర్చిపెట్టింది. చదువు అవుతూనే అక్కడే తనకి ఇష్టమైన సైంటిస్ట్ ఉద్యోగం రావడం తో అమెరికాలోనే శాశ్వతంగా స్థిరపడాలని నిర్ణయించేసుకున్నాడు. అందుకు తోటి ఉద్యోగిని అమెరికా పౌరురాలు అయిన హెలీనా ని పరిణయమాడాడు. తల్లిదండ్రుల అనుమతి తీసుకోవడం అటుంచి, కనీసం పెళ్లిచేసుకుంటున్నట్టు కూడా తెలియపరచలేదు ఆర్నెల్ల దాకా. పాపం వాళ్ళు కొడుకు ఉద్యోగస్తుడయ్యాడు, ఇంకా ఇంటివాడవ్వడమే మిగిలింది అనుకుంటూ సంబంధాలు వెతికేస్తోంటే చల్లగా చెవిన వేశాడు.

అది కూడా వారి పట్ల గౌరవం తో కాదు, భార్య కడుపుతో ఉండడం, చేసిపెట్టేవాళ్ళెవరూ లేకపోవడం, మనవడు పుట్టాక చెప్తే నలుగురూ ఛీ అంటారేమో నన్న ఏ మూలో భయం వగైరా కారణాలతో అనుకోకుండా పెళ్లి చేసుకోవాల్సి వచ్చిందని ఏవో సంజాయిషీలతో క్షమించమంటూ, కొసమెరుపు గా తల్లిని కొంతకాలం తమ వద్దకు పంపమని పెద్ద ఉత్తరం వ్రాసి పడేశాడు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది... ఏమనగలరు అంతా అయిపోయాక? కొడుకుని కాదనుకోలేరు కదా? తల్లి పెద్ద మనసుతో వచ్చి నిలబడింది హెలీనా కాన్పు సమయంలో కవలలు పుట్టారు. కొడుక్కి మురళి, కూతురికి రోసీ అని పేర్లు పెట్టాడు. పిల్లల సేవ కోసం తల్లి ఇక్కడ ఉండిపోవడం తో అక్కడ తండ్రికి ఇబ్బంది! పోనీ పంపిచేద్దామా అంటే ఇక్కడ ఇద్దరు పిల్లలతో హెలీనా కి అవస్థ... ఏం చేయాలో తెలియని పరిస్థితి. వేరే గత్యంతరం లేక తల్లి తో మురళి ని కొంతకాలం పంపించేయాలని భార్యాభర్తలిద్దరూ నిర్ణయించుకున్నారు. తల్లి కూడా పరమానందభరిత అయింది. అసలు కంటే వడ్డీ ఎప్పుడూ ముద్దే కదా? మురళి ని ఏ లోటూ లేకుండా జాగ్రత్తగా చూసుకొనేవారు అమ్మానాన్న. తను, భార్య... రోసీ పెంపకం లో, ఉద్యోగ ఒత్తిళ్ళలో తలమునకలుగా ఉంటూ వారానికో, నెలకో పలకరిస్తూ ఉండేవారు. మంచి స్కూల్ లో జేర్పించమని, వాడి అవసరాలకని డబ్బు మాత్రం పంపించేవాడు. మనవడి ధర్మమా అని కొడుకు తో మాట్లాడగల్గుతున్నాం అని సంతోషించేవారు వాళ్ళు. కొన్నాళ్లు పోయాక చెల్లి పెళ్లి కి వెళ్లినప్పుడు మురళి ని తమతో అమెరికా తీసుకు వచ్చేసారు.

చెల్లెలు పెళ్లి గురించి తన వంతుగా ఏమీ కల్పించుకోలేదు. అది తన బాధ్యతగా కూడా భావించలేదు. దీప బ్యాంక్ క్లర్క్ గా సెలెక్ట్ అయ్యి అదే బ్యాంక్ లో పి.వో గా పనిచేస్తున్న దినకర్ ని పెళ్లి చేసుకుని తల్లి దండ్రుల కి దగ్గరలో క్వార్టర్స్ లో భర్త, అత్తమామలతో కాపురం ఉంటూ వారానికోసారి పుట్టింటి వాళ్ళని కలుస్తూ కష్టం సుఖం కనుక్కుంటూ చేదోడుగా ఉండేది. మురళిని తెచ్చేశాక తల్లిదండ్రులకి ఫోన్ చేయడం మరీ తగ్గించేశాడు... డబ్బు పంపితే తన బాధ్యత తీరిపోతుందని అనుకునేవాడే తప్ప, జీవితం లో డబ్బు కంటే విలువైన బంధాలు, అనుబంధాలు ఉంటాయని వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏనాడూ

అనుకోకపోవడం నిజంగా దురదృష్టం. తను ఫోన్ చేస్తే వాళ్లెంత పొంగిపోయేవారో? కన్న వాళ్ల బాగోగులు తాను పట్టించుకోకపోయినా కన్న మమకారం తో, బదులు ఆశించని ప్రేమతో అమ్మ ఎన్నో జాగ్రత్తలు చెప్పేది..."భానూ కన్నా! వేళ కి భోజనం చేస్తున్నావా? ఎక్కువసేపు మేలుకొని ఉండకు. కార్ నడిపేడపుడు జాగ్రత్త. ఆరోగ్యం నిర్లక్ష్యం చేయకు నాన్నా" అంటూ. తనకేమో చిరాగ్గా ఉండేది. ఇంత పెద్దవాణ్ణయినా ఏంటీ చాదస్తం అమ్మకి? అని. మనసు గ్రహించినట్లు "భానూ! నువ్వు ఎంత పెద్దవాడివైనా మాకు ఎప్పుడూ చిన్న వాడివేరా! ఇలా చెప్తూనే ఉంటా నువ్వేమనుకున్నా సరే." అనేది నవ్వుతూ. అమ్మప్రేమని అర్ధం చేసుకోలేని మూర్ఖుడు తను. డబ్బే లోకం గా బతికాడు తప్ప లోకంలో డబ్బుకి మించి అమూల్యమైన రక్త సంబంధాలని దూరం చేసుకుంటున్నానని తెలుసుకోలేకపోయాడు.

వాతావరణ ప్రభావం. మనిషి వ్యక్తిత్వాన్ని శాసిస్తుంది అనడానికి మురళి, రోసీ లే నిదర్శనం. నాన్నమ్మ, తాతయ్యల సంరక్షణ లో కొద్దికాలమే ఉన్నా భారతీయ సంస్కృతి విలువల్ని బాగా వంటపట్టించుకున్నాడు మురళి. ఇంకో పక్క కవల సోదరే అయినా రోసి నడవడి, తీరు తెన్నూ పూర్తిగా భిన్నం. చాలా స్వతంత్ర భావాలు, మాట లక్ష్య పెట్టకపోవడం, మొండితనం ...తల్లి దేశం నించి, తల్లి నించి అబ్బిన సుగుణాలు రోసీ కి. తల్లిదండ్రులు చిన్నప్పుడే విడిపోవడంతో హెలినాకి కుటుంబ వ్యవస్థ మీద అంత వ్యామోహం లేదు. నాకు మొదటినించి స్వార్ధం, అందరికంటే పై మెట్టు లో ఉండాలన్న తపనే ఎక్కువ. అవసరానికి అంటించుకుంటాను, అవసరం తీరాక వదిలించుకుంటాను. ఈ హై సొసైటీ లో ఇలాగే ఉండాలన్నదినా విశ్వాసం. ఎవరి ప్రైవసీ వాళ్ళది. ఎవరం ఎవర్నీ ప్రశ్నించం. ప్రేమాప్యాయతల నందనం లో పెరిగి ఇలాటి వాతావరణం లోకి అడుగుపెట్టిన మురళి చాలా ఉక్కిరిబిక్కిరి అయిపోయే ఉంటాడని నాకిప్పుడు తెలుస్తోంది. నాన్నమ్మ అందించిన మాతృప్రేమ, లాలన ఇక్కడ కన్నతల్లి నించి పొందలేకపోయాడు. రోసీ సరేసరి. "హాయ్ బ్రో", "బాయ్ న్నా" తప్ప మరో ముక్క లేదు. నేను గాంభీర్యం ముసుగులో తండ్రిగా వాడి కెరీర్ ని నాకు నచ్చినట్టుగా డిజైన్ చేసేశాను. ఫలితం..? మెడిసిన్ చదవాలని ఉన్నా నేను చెప్పినట్టు కిమ్మనకుండా మళ్ళీ మాకు దూరంగా ఫ్లోరిడా లో ఇంజనీరింగ్ జాయిన్ అయ్యాడు.

డబ్బు వ్యామోహం చాలా చెడ్డది. మనుషుల మధ్య అనుబంధాలని తుంచేస్తుంది. మానవ సంబంధాల్లో కాలిక్యులేషన్ కే తను పెద్ద పీట వేశాడు. తానేంటో, ఏం చేస్తున్నాడో , ఏం కోల్పోతున్నాడో ఆలోచించుకోవడానికి కూడా సమయం కేటాయించుకోలేనంత బిజీ అయిపోయాడు ఒక్కసారిగా. మిలియనీర్ కావాలన్నదే తన లక్ష్యమైంది... ఇదిలా ఉండగా రోసీ తన క్లాస్ మేట్ తో రిలేషన్ షిప్ కి వెళ్ళడం పెద్ద షాక్. ఇది మన సంస్కృతి కాదని చెప్పబోయా. తల్లీ కూతుళ్ళిద్దరూ వింతజంతువుని చూసినట్టు చూశారు. హెలినా ఈ దేశస్థురాలు. కూతుర్నే సమర్ధించింది తప్పేంటని?

రోసీ కి నేను తండ్రినేగాని తను ఈ దేశపు బిడ్డ, ఆ తల్లికి కూతురు. కన్నకూతురి సుఖం కోసం వేల డాలర్లు ధారపోసాడు. తండ్రిగా దగ్గర కూచోపెట్టుకొని ఆ పిల్లకి మన దేశం, సంస్కృతి, సంప్రదాయాలు ఎప్పుడైనా చెప్తే కదా? కనీసం కాస్త పాటి తెలుగు కూడా నేర్పించలేకపోయాను. ఇక్కడి వాళ్ళు చక్కగా హిందీ, భరతనాట్యం, సంగీతం, యోగా నేర్చుకుంటూ మన వస్త్రధారణ లో కనిపిస్తూ భారతీయ సంస్కృతి ని గౌరవిస్తోంటే నా కూతురు సగం భారతీయురాలినన్న విషయాన్ని కూడా ఎప్పుడో విస్మరించి, మనసా, వాచా, కర్మణా పూర్తి అమెరికన్ గానే చెలామణి అయిపోతోంది.

ఉన్నట్టుండి మరో షాక్ ! ఏ కారణం లేకుండానే హెలీనా ఒకరోజు విడిపోదామని ప్రపోజల్ పెట్టింది. అర్ధం కాలేదు నాకు. "లైఫ్ ఈజ్ సో బోరింగ్ బాన్!. ఐ నీడ్ సం చేంజ్. అట్లాంటా వెళ్లిపోవాలని ఉంది. యూ డోంట్ వర్రీ. నా షేర్ ఏమిస్తావ్? ఐ మీన్ ఇన్నేళ్లు నీతో ఉన్నాగా!" అంటూ కనుబొమ్మలెగరేసింది. విదేశీ సంస్కృతికి,యాంత్రిక జీవనశైలికి అలవాటుపడ్డ తనకి భార్య ప్రపోజల్ అంతగా బాధించలేదు. ఎప్పుడు ఆమెతో మనస్పూర్తిగా తిరిగ్గా సమయం గడిపాడు గనక? లక్ష డాలర్లు తీసుకొని ముద్దుపెట్టి "బాయ్" అంటూ హేపీ గా వెళ్ళిపోయయింది ఇల్లాలు నా జీవితం లోంచి. కొడుకు, కూతురు దూరంగా ఉండడంతో ప్రయోగాలు, సంపాదన మీదే ఇంక దృష్టి లగ్నం చేశాడు. ఇక్కడ ఇంత ఫ్రస్ట్రేషన్ కి లోనవుతున్నా అమ్మానాన్న, చెల్లి గుర్తొచ్చేవాళ్లేకాదు అదేంటో!

ఇంజినీరింగ్ లో మాస్టర్స్ చేశాక మురళి లో చాలా మార్పు వచ్చింది. ఎప్పుడూ తన మాట జవదాటని కొడుకు మొదటిసారిగా ఎదిరించి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఎందుకు? ప్రేమించిన పిల్ల కోసం కాదు. ఆరోజు తనకి బాగా గుర్తు. "సారీ నాన్నా. నేనింక ఈ బందిఖానా లో ఉండలేను. నిస్సారమైన ఈ యాంత్రిక జీవితం నాకు వెగటు కలిగిస్తోంది. ఈ రంగుల లోకం నాకొద్దు. డాలర్ల వ్యామోహం లో పడి అస్తిత్వాన్ని, జీవన మాధుర్యాన్ని కోల్పోతానేమో అని భయం గా ఉంది. నేను మీలాగా పెద్ద లక్ష్యాలున్న వాణ్ణి కాదు..ఇలా అంటున్నందుకు క్షమించండి నాన్నా. నాన్నమ్మ చెప్పేది ఎంత సంపాదించినా నా అన్న వాళ్ళని నలుగురిని మిగుల్చుకోలేకపోతే ఈ జన్మకి సార్ధకత ఉండదని... అమ్మ, చెల్లి మమతానురాగాలు నాకెప్పుడూ అందలేదు. నాకు! నాన్నమ్మ, తాతయ్య, అత్తయ్య, మామయ్య, పిల్లలు .. వీళ్ళందరి తో నా చిన్నతనం ఎంతో ఆహ్లాదంగా గడిచింది. తర్వాత ఇక్కడికి వచ్చాక ఫొటోల్లోనూ, ల్యాప్ టాప్ లోనే తప్ప ప్రత్యక్షం గా చూడలేదు. నాకు ఊహ తెలిసాక మళ్ళీ వాళ్ళని ఎప్పుడూ కలవలేదు." మురళి ఏం చెప్పాలనుకుంటున్నాడో నాకు అర్ధం కావట్లేదు.

"ఇంక ఆలస్యం చేయడం నాకిష్టం లేదు. నాకు మమతలు పంచే కుటుంబం కావాలి. నా రక్త సంబంధీకులు కావాలి. అందుకే ఇండియా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను. మిమ్మల్ని రమ్మనే సాహసం చేయ(లే)ను. నన్ను ఆపే ప్రయత్నం మీరూ చేయకండి. నాన్నమ్మకి, తాత గారికి వార్ధక్యం లో ఆసరాగా నిలబడతాను. వస్తా" అని వెళ్లిపోయాడు.

అహంకారం, మొండితనం అణువణువునా నిండిపోయిన తను హుంకరించి మిన్నకుండిపోయాడే గాని కొడుకు మాటల్లో తనవాళ్ళపట్ల ఉన్న ప్రేమానురాగాల్ని, బాధ్యతని గుర్తించి కళ్ళు తెరుచుకొని అమ్మానాన్నల దగ్గరికి వెళ్లాలని మాత్రం అనుకోలేదు. ఒకరోజు కూతురు బోయ్ ఫ్రెండ్ తో గొడవపడి విడిపోయి ఇంటికొచ్చి ఏదో బిజినెస్ చేస్తా డబ్బులిమ్మంది. ఆ అబ్బాయితో కలిసి ఉండమని సర్ది చెప్పాలని చూశాను. ఇదివరకు చూసినట్టే వింతగా చూసింది. ఎన్ని అర్ధాలో? ఇంకా నువ్వు మారలేదా? అనో లేక నీ పెళ్ళామే నిన్ను వదిలి చక్కాపోయింది నువ్వు నాకు చెప్పేంతటివాడివా? అనో మరి. మారు మాట్లాడకుండా ఆస్తి సగం దాని పేర రాసేశాడు ఇంకా మళ్ళీ మళ్ళీ అడక్కుండా. నెల రోజులకి ఇంకొక పిల్లాడిని వెంటబెట్టుకొచ్చింది "మీట్ మై న్యూ బోయ్ ఫ్రెండ్" అంటూ. వాళ్ళని మనస్పూర్తిగా దీవించాను.. మనసులో ... కొన్నాళ్ళైనా కలిసి ఉండమని. రోసీ అమాయకురాలేం కాదు. నా పోలికే. మనుషుల్ని వాడుకుంటుంది అవసరం తీరిపోతే వదిలించేసుకుంటుంది. ఏ రకమైన

ఎటాచ్ మెంట్స్ , ఫీలింగ్స్ వుండవు. దాని గురించి బెంగ అనవసరం. కాని పూర్ బోయ్ (ఫ్రెండ్)!

కొన్నాళ్ళకి అమెరికా నించి యూరోప్ వచ్చేశాడు ఇంకా మంచి ఉద్యోగం రావడంతో. అక్కడ పరిచయమైన జెన్నిఫర్ తో కొంతకాలం సహజీవనం సాగించాడు. జెన్నీ మొదటి భర్త మరణించడంతో కొన్నాళ్ల నించి ఒంటరిగా ఉంటోంది. ఇద్దరం కల్సి ఉండాలని నిర్ణయించుకున్నాం. నా లాగే ఆలోచించే జెన్నీ కొంతకాలం అద్భుతం గా అన్పించింది. కొన్నాళ్ళకి నేను కోరుకునే జీవితం ఇదికాదు, ఇంకేదో ఉంది, ఏదో మిస్సవుతున్న భావన మొదలయ్యింది లోలోపల. బహుశా వృద్ధాప్య ఛాయలు ఆవరిస్తోండడం వల్లనేమో! అమ్మానాన్నలతో, కొడుకు తో ఫోన్ లో మాట్లాడుతున్నా ఏదో... అపరాధ భావం! ఎలా అయిందో ఏంటో హఠాత్తుగా జెన్నీ అధ్యాత్మికం వైపు ఆకర్షించబడి హరేకృష్ణ బృందం లో జేరి దేశాంతరం వెళ్లిపోయింది. ఐదేళ్లు గడిచిపోయాయి. రోసీ టాప్ బిజినెస్ ఉమన్ గా సెటిల్ అయిపోయింది, టీవి ల్లో కన్పిస్తూ ఉంటుంది ఇంటర్వ్యూ లిస్తూ. రెండో అబ్బాయి తోనే కంటిన్యూ అవుతున్నట్టుంది నా ఆశీర్వాదం ఫలించి. ఒక కొడుకు దానికి. మేనమామ పోలిక వస్తే బాగుండు అనుకుంటా ఎప్పుడూ.

దీప కూతుర్ని పెళ్లిచేసుకొని మురళి నాన్నమ్మ, తాతయ్యల్ని ప్రేమగా చూసుకుంటూ కొడుకు గా నిలబడ్డాడు..తను ఇక్కడ ఒంటరిగా ప్రేమరాహిత్యంగా కాలక్షేపం చేస్తున్నాడు. అమ్మ చనిపోయినప్పుడు కూడా వెళ్లలేకపోయాడు. కెనడా టూర్ లో ఉండడంతో. అన్నీ మురళియే చూసుకున్నాడు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఎన్నో ప్రశ్నలు! నా జీవితం లో ఏం సాధించానసలు? సొంతవాళ్లని ఎప్పుడు సంతోషపెట్టాను? వాళ్ళకి కొడుకుగా ఏం బాధ్యత తీసుకున్నాను?? భార్యని ఎప్పుడు అర్థం చేసుకునే ప్రయత్నం చేశాను? కూతుర్ని పద్ధతిగా ఏం పెంచాను? కొడుకు మాటకి ఎప్పుడు విలువిచ్చాను? డబ్బు, తెలివితేటలు ఉంటే ఇంకేమీ అక్కర్లేదు అనుకున్నా.

అనుకోకుండా ఒక రోజు యూట్యూబ్ లో "చాగంటి వారి రామాయణం - మానవ సంబంధాలు" వింటుంటే నేను చేసిన తప్పులన్నీ తేట తెల్లమయ్యి నా జీవితం నన్ను వెక్కిరించసాగింది. మహానుభావుడు ఎంత బాగా కాచి వడపోశారో జీవితసత్యాలని! "ఏది సుఖాన్నిస్తుందో అదే కొన్నాళ్ళకి దుఖహేతువు అవుతుంది.. అది మనిషే కావచ్చు, డబ్బే కావచ్చు. దేని పట్ల విశేషమైన అనురక్తి పెట్టుకోకండి. డబ్బుతో, కీర్తితో మనసు నిండదు. కన్నవాళ్లని ఉసురు పెట్టకండి. ప్రతిఫలమాశించకుండా ప్రేమించేది, తప్పు చేసినా క్షమించేది కన్నవాళ్ళే". జీవితమంతా సంపాదన యావే తప్ప మంచి పుస్తకాలు ఎన్నడయినా చదివానా? ఆధ్యాత్మిక ప్రసంగాలు విన్నానా? వారి మాటల్లో ఏదో అద్భుతమైన ఆకర్షణ నన్ను మంత్ర ముగ్ధుణ్నిచేసింది. ఆరోజు నించి నా ఆలోచనా దృక్పథం మారింది. అంతర్యానం మొదలైంది.

బీర్ తాగడం పూర్తయ్యాక డిన్నర్ ఆర్డర్ చేసి ఎదురుగా ఉన్న టేబిల్ వైపు చూశాను. ముగ్గురు యూరోపియన్ యువకులు 4 శాండ్ విచ్ లు ఆర్డర్ చేసి, మూడే తిని నాల్గింటికి డబ్బు చెల్లించారు. ఇదిక్కడ మామూలే... హోటల్స్ లో ఎక్కువ పదార్థాలకి ఆర్డర్ చేసి, కొంత మాత్రమే తిని మొత్తం బిల్లు కట్టేస్తారు. ఇది సస్పెండెడ్ ఐటం అన్న మాట. బీదవాళ్ళ సహాయార్థం

ఉపయోగిస్తారు. హోటల్ వాళ్ళు ఆ రోజు వచ్చిన సస్పెండెడ్ ఐటమ్స్ ని ఒకపక్కన ఉంచుతారు. ఎవరైనా అన్నార్తులు, బీదవాళ్లు వచ్చి సస్పెండెడ్ ఐటం కావాలని అర్థిస్తే హోటల్ వాళ్ళు వారికి ఇవి అందజేసి బిల్లు కట్టిన వాళ్ళ పేరు చెప్తారు. వారు ఆనందంగా స్వీకరించి దానం ఇచ్చిన వాళ్ళకి మంచి జరగాలని ఆశీర్వదిస్తారు. నాకెందుకో ఒక్క క్షణం సస్పెండెడ్ శాండ్ విచ్ లా "సస్పెండెడ్ లవ్" కూడా ఉంటే ఎంత బాగుండు అన్పించింది. ఒకప్పుడు అందరి ప్రేమ కి పాత్రుడైన తాను, తీసుకోవడమే గాని ఇవ్వడం తెలియక ఇప్పుడు సంధ్యా సమయం లో అదే ప్రేమ కోసం కొట్టు మిట్టాడుతూ, వారి దగ్గరికి వెళ్లడానికి మొహం చెల్లక పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు. దూరంగా కొండల ఆవల అస్తమిస్తున్న ఆదిత్యుడు... తన జీవితానికి సింబాలిక్ గా! "తూర్పు" తల్లి గర్భాన్ని చీల్చుకొని వెలుగు పుంజాలతో పుట్టి పెరిగిన భానుడు "పడమటి" మోజుతో చకచకా పరుగులు తీసి చివరికి అక్కడే అస్తిత్వాన్నికోల్పోతున్న దృశ్యాన్ని చూస్తూ మలి సంజె వేళ మమతల కోసం ఆక్రోశిస్తున్నాడు ఈ "పడమటి భానుడు."

***



అరవై ఐదేళ్ళ విభీషణరావు న్యూజిలాండ్ రాజధాని వెల్లింగ్టన్ లో నలభై ఏళ్ళుగా ఓ డిపార్ట్మెంటల్ స్టోర్ ని నడుపుతున్నాడు. ఆర్నెల్ల క్రితం అతని కొడుకు, కోడలు ఓ రోడ్ ప్రమాదంలో మరణించడంతో... భార్య శాంతమ్మ, ఏడేళ్ళ మనవడు సన్నీలతో స్వదేశానికి తిరిగివెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు అతను. పోయినవారి జ్ఞాపకాలు కలచివేస్తూండడమేకాక, మనవణ్ణి తమ సొంత సంస్కృతి, సంస్కారాల నడుమ పెంచాలన్నదికూడా అందుకు ఓ కారణం.

చిన్నవయసులోనే విదేశాలకు వెళ్ళిపోయిన విభీషణరావుకు స్వదేశంలో బంధువు లెవరితోనూ టచ్ లేకుండా పోయింది. హైదరాబాద్ లో ఉండే ఓ స్నేహితుడు, గుర్నాథరావు సలహా, సహకారాలను కోరాడు. మర్నాడు ఇండియాకి ప్రయాణమనగా ముందురోజు రాత్రి మిత్రుడితో ఫోన్లో చాలాసేపు మాట్లాడాడు...

హైదరాబాద్ లోని శంషాబాద్ ఏర్ పోర్ట్ లో విభీషణరావు కుటుంబాన్ని రిసీవ్ చేసుకుని వెస్ట్ మారేడ్ పల్లిలోని తన ఇంటికి తీసుకువెళ్ళాడు గుర్నాథరావు... జూబిలి హిల్ల్స్ లో ఇండిపెండెంట్ హౌస్ ఒకటి అమ్మకానికి ఉందని తెలిసి దాన్ని కొనుగోలువేయడానికి పూనుకున్నాడు విభీషణరావు. బేరం కుదిరి రిజిస్ట్రేషన్ కోసం రెజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్తే, విభీషణరావు యొక్క 'ఆధార్ కార్డ్' నకలును దస్తావేజులకు జతపరచాలన్నారు. తాను న్యూజిలాండ్ నుండి ఇటీవలే స్వదేశానికి తిరిగివచ్చానని, ఆధార్ కార్డ్ ఇంకా తీసుకోలేదని వివరించబోతే వినిపించుకోలేదు రెజిస్ట్రార్. ఆధార్ పత్రం లేనిదే రెజిస్ట్రేషన్ సాధ్యంకాదంటూ త్రిప్పి పంపేసాడు.

ప్రస్తుతం దేశంలో 'ఆధార్' హవా వీస్తోందని, ప్రతి వ్యవహారానికీ అది కేంద్రబిందువు అయిందని మిత్రుడు వివరిస్తూంటే నోరు తెరచుకుని ఆలకించాడు విభీషణరావు. ప్రస్తుతానికి తనకు అద్దె కొంపే గతి అన్న విషయం బోధపడింది... బంజారాహిల్స్ లో నెలకు ముప్పైవేల రూపాయల అద్దెకు ఇండిపెండెంట్ హౌస్ ఒకటి చూసాడు. లక్షరూపాయలు ఎడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ రాసుకోబోతే, అతని ఐడెంటిటీని ధ్రువపరచే 'ఆధార్ కార్డ్' కావాలన్నాడు ఇంటి యజమాని!

"ప్రభుత్వ రంగానికి చెందిన పనులైతే ఆధార్ కాని, ప్రైవేట్ వ్యవహారాలకు ఎందుకు?" విస్తుపోయాడు విభీషణరావు.

"సారీ! పనిమనిషిని సైతం 'ఆధార్' లేనిదే పనిలో పెట్టుకోకూడదన్నది పోలీస్ రూల్. ఆధార్ కార్డ్ లేనివారికి నా ఇల్లు అద్దెకివ్వలేను," ఖచ్చితంగా చెప్పేసాడు ఇంటి యజమాని.

"దిసీజ్ టూ మచ్!" అంటూ అతని మీద ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ కి వెళ్ళాడు విభీషణరావు.

ఫిర్యాదును నమోదు చేసుకోవడానికి 'ఆధార్' కావాలన్నారు పోలీసులు.

హతాశుడైన విభీషణరావు స్నేహితుడితో మొరపెట్టుకుంటే, అతను నవ్వి, "దేశంలోని ప్రతి పౌరుడికీ ఓ జాతీయ గుర్తింపును కలుగజేయాలన్నది ప్రభుత్వాశయం. ఎర్రమంజిల్ లో ఉన్న నా గెస్ట్ హౌస్ ప్రస్తుతం ఖాళీగానే ఉంది. స్వంత ఇల్లు అమరేంతవరకు మీరు అందులో ఉండొచ్చును" అన్నాడు. ఓ నౌకరుతో పాటు వంటకోసం గ్యాస్ స్టవ్, సిలిండర్ కూడా ఏర్పాటుచేసాడు గుర్నాథరావు.

బ్యాంక్ ఎకౌంట్ తెరచి ఫారిన్ ఎకౌంటులో ఉన్న తన సొమ్మును అందులోకి బదిలీ చేసుకోవాలనుకున్నాడు విభీషణరావు. తీరా బ్యాంక్ కి వెళ్ళితే, ఖాతా తెరవడానికి ఆధార్ కార్డ్ తప్పనిసరి అన్నారు. నుదురు కొట్టుకున్నాడు అతను.

మనవణ్ణి స్కూల్లో చేర్పించాలని ఓ పబ్లిక్ స్కూల్ కి వెళ్ళాడు విభీషణరావు. అతన్ని (పిల్లాణ్ణి కాదు!) గంటసేపు ఇంటర్వ్యూ చేసి ఎడ్మిషన్ ఇవ్వడానికి ఒప్పుకుంది స్కూల్ మేనేజ్మెంట్. అప్లికేషన్ పూర్తిచేస్తున్నప్పుడు కాని తెలిసిరాలేదు అతనికి, 'ఆధార్ కార్డ్' నకలును తప్పనిసరిగా జతపరచాలని. తాను ఆఫర్ చేసిన ఫ్యాట్ డొనేషన్ కూడా ఉపకరించకపోవడంతో నిశ్చేష్ఠుడయ్యాడు.

అనంతరం కుకింగ్ గ్యాస్ కనెక్షన్ కీ... టెలిఫోన్ ల్యాండ్ లైన్ కనెక్షన్ కీ... మొబైల్ ఫోన్ కొనుగోలుకీ - అలా అన్నిటికీ 'ఆధారే' ఆధారం కావడం ఉక్కిరిబిక్కిరిచేసింది అతన్ని.

"ఇది మునుపటి ఇండియా కాదు. సూపర్ పవర్ కావాలన్న ఐడియాతో ఉరుకులు పరుగులు పెడుతూన్న దేశం. అన్నిటా నూతనత్వమే..." అంటూ గుర్నాథరావు వివరిస్తూంటే, నోరు వెళ్ళబెట్టాడు విభీషణరావు.

ఓ రోజున భార్యను, మనవణ్ణీ తీసుకుని ప్రసాద్ ఐ-మాక్స్ లో సినిమాకి వెళ్ళాడు విభీషణరావు. ఆధార్ కార్డ్ చూపిస్తే కాని ప్రవేశం లేదన్నారు. ఆమధ్య నగరంలో సంభవిస్తూన్న ఉగ్రవాద చర్యల కారణంగా ఆధార్ ఐడెంటిటీ లేనిదే లోపలికి అనుమతించరాదని ప్రభుత్వం నిర్దేశించిందట! చేసేదిలేక తిరుగు ముఖం పట్టిన ఆ కుటుంబం, డిన్నర్ చేసి ఇంటికి వెళ్ళవచ్చునని ఓ స్టార్ హోటల్ కి వెళ్ళింది. అక్కడా అదే నిబంధన!

'అడ్మిషన్ విత్ ఆధార్ ఓన్లీ' - అన్న బోర్డ్ చూసి హతాశులై ఇంటి ముఖం పట్టారు.

ఆ తరువాత షాపింగ్ మాల్స్ లోనూ అదే అనుభవం. రైల్వే స్టేషన్స్, బస్ స్టేషన్స్ లో ప్రవేశానికి సైతం 'ఆధార్' తో 'లాగ్ ఇన్' చేస్తే తప్ప నో ఎంట్రీ!

పౌరుల నిత్యజీవితాలు ఆధార్ కార్డ్ తో ఎంతగా ముడిపెట్టుకుపోయాయో గ్రహింపుకు వచ్చిన విభీషణరావు, ఇక ఆలస్యం చేయకుండా కుటుంబంతో అధార్ నమోదు కేంద్రానికి వెళ్ళాడు. క్షణ క్షణానికీ హనుమంతుడి తోకలా పెరిగిపోతూన్న క్యూని చూసి జడుసుకున్నాడు. ఇంకా కొన్ని లక్షలమంది నమోదు చేసుకోవలసియుందట నగరంలో. 'ఆన్ లైన్' ఎన్ రోల్మెంట్ ఫెసిలిటీ ఉన్నా అది పనిచేయదట. అందుకే నమోదు కేంద్రాల వద్ద అంత పెద్ద క్యూలు, తొడతొక్కిడూలూ, ఆ త్రొక్కిసలాటలో మరణాలూ సంభవిస్తున్నాయట. ఆ విషయాలన్నీ ఆలకించి తెల్లబోయాడు అతను.

సుమారు వారం రోజులపాటు ఉదయం నుండి సాయంత్రం వరకు కుటుంబమంతా మండుటెండలో పడిగాపులు పడితే కాని విభీషణరావు వంతు రాలేదు. తీరా వచ్చాక, నమోదు కోసం అతని వంతు రెండేళ్ళ తరువాత కాని రాదంటూ... ఓ సీరియల్ నంబరూ, రెండేళ్ళ తరువాయి తేదీ, సమయమూ ఇవ్వబడ్డాయి...కొయ్యబారిపోయిన విభీషణరావు, అధికారులతో తన గోడు వెళ్ళబోసుకోబోతే వినిపించుకునే నాథుడే లేకపోయాడు.

దేశంలోని పరిస్థితి పూర్తిగా అవగాహన అయిపోయింది విభీషణరావుకు. స్వదేశంలో తనకు, తన కుటుంబానికీ తావులేదు. 'ఆధార్' కార్డ్ లేనిదే తాము నిరాధారు లయిపోతారు. నమోదు కోసం ఎదురుచూసే ఆ రెండేళ్ళూ తాము ఎలా జీవించాలో బోధపడలేదు. అందుకే బాగా ఆలోచించి నిర్ణయానికి వచ్చాడు - న్యూజిలాండ్ కి తిరిగి వెళ్ళిపోవాలని! ఉనికికి గుర్తింపు లేని చోట నిత్యమూ తిప్పలుపడే కంటె, అదే మంచిది అనిపించింది.

ఆలస్యం చేయకుండా ఫ్లైట్ టికెట్స్ కొనడానికి ఏర్ లైన్స్ ఆఫీసుకు వెళ్ళాడు. అక్కడ వాళ్ళు చెప్పిన సంగతి అతన్ని ఖంగు తినిపించింది. స్వదేశ యానానికే కాదు, విదేశీ ప్రయాణానికి సైతం ఆధార్ ఐడెంటిటీ లేనిదే టికెట్స్ ఇష్యూ చేయబడవు!

అంటే... తాను, తన కుటుంబమూ ఆ 'త్రిశంకు నరకం'లో చిక్కుకుపోయారన్నమాట!!

'ఓ౹...నో...!' అంటూ అరిచాడు విభీషణరావు.

#

"ఏమండీ! ఎందుకలా అరిచారు? పీడకల ఏదైనా వచ్చిందా?" అంటూ భార్య శాంతమ్మ తట్టి లేపుతూంటే - కన్నులు తెరచిన విభీషణరావు అయోమయంగా పరిసరాలను పరికించాడు.

అది - వెల్లింగ్టన్ లోని తన బెడ్ రూమ్!

'ఓహ్, అదంతా కలా...!?' అనుకుంటూ, మళ్ళీ కన్నులు మూసుకున్నాడు.

గత రాత్రి ఫోన్ లో స్నేహితుడితో మాట్లాడుతూండగా, సందర్భవశాత్తూ, ప్రస్తుతం ఇండియాలో ప్రజలు పడుతూన్న 'ఆధార్' కష్టాలను గూర్చి విపులంగా చెప్పుకు వచ్చాడు అతను. బహుశా దాని గురించే ఆలోచిస్తూ పడుకున్నందునేమో ఆ కల వచ్చియుంటుందనుకున్నాడు విభీషణరావు. దీర్ఘాలోచనలో పడిపోయాడు.

"మన ఇండియా ప్రయాణం ఇవాళే కదండీ! సర్దుకోవలసినవి బోలెడు ఉన్నాయి. మీరింకా పడుకునే ఉంటే ఎలా? లేవండి పైకి" అంది శాంతమ్మ వచ్చి తొందర చేస్తూ.

అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిన విభీషణరావు, "మన స్వదేశీ యానం క్యాన్సెల్, శాంతా! నలభై ఏళ్ళుగా మనల్ని ఆదరించి ఆదుకున్న ఈ దేశాన్ని వదలి వెళ్ళబుద్ధి కావడంలేదు నాకు. పైగా కొత్త ప్రాంతానికి వెళ్ళి మన ఉనికిని కోల్పోయి నిరాధారం కావడం మూర్ఖత్వం అవుతుంది. అది పుట్టిన గడ్డ అయినా సరే!" అన్నాడు తాపీగా. 'ఆధార్' ఇక్కట్లను గూర్చి ఆమెతో చెప్పాలనిపించలేదు.

తెల్లబోయి చూసింది ఆమె.

అప్పుడే అక్కడికి వచ్చిన సన్నీ చప్పెట్లు కొడుతూ, "భలే, భలే! ఇక్కడ నా ఫ్రెండ్స్ ని మిస్సవ్వను నేను. థాంక్ యూ,

తాతయ్యా!" అంటూ విభీషణరావును ముద్దులు పెట్టేసుకున్నాడు ఆనందంగా.

***




రాంబాబుకి నాలుగురోజుల్లో పెళ్ళి. కాని రాంబాబుకి ఒక కోరిక మనసులో తొలిచేస్తోంది. అది పెళ్ళిలోనే తీర్చుకోవాలి. అదే యెలా తీర్చుకోవాలా అనే అతని బాధంతానూ. అది కూడా అంత కోరరానిదేవీ కానేకాదు.. చిన్నప్పట్నుంచి అతనిలో యేమూలో దాగిన ఆ కోరిక పెళ్ళి దగ్గరపడుతున్నకొద్దీ మహావృక్షమైపోయింది.

అసలుసంగతేంటంటే.. రాంబాబుకి పదేళ్ళున్నప్పుడు అంటే ఇరవై సంవత్సరాలక్రితం అతని ఆఖరిపిన్ని సరస్వతి పెళ్ళైంది. ఆ

పెళ్ళిలో మొట్టమొదటిసారి చూసేడు రాంబాబు పెళ్ళికొడుకు అలకపాన్పు యెక్కడం. యెక్కడం అంటే.. అక్కడో మంచం వేసి, దాని మీద దుప్పటి పరిచి సరస్వతి పిన్నిని పెళ్ళిచేసుకునే బాబాయ్ ని కూర్చోబెట్టేరు. అదికాదు రాంబాబు గమనించింది. ఆ తర్వాత జరిగిందే అతన్ని అబ్బురపర్చింది.

ముందు తాతగారు వచ్చి పెళ్ళికొడుకుని మిగిలిన పెళ్ళితంతు జరిపించడానికి రమ్మన్నారు. బాబాయ్ మాట్లాడలేదు.. ఊహు.. కాదు.. బాబాయ్ మాట్లాడబోతుంటే ఆయన అక్కగారు.. "మా తమ్ముడు అలిగాడండి.." అంది. రాంబాబు తాతగారు "యేం కావాలయ్యా.."అంటే ఆ అక్కగారే "మీకు తెలిందేవుంది మావయ్యగారూ, మా తమ్ముడు ఆఫీసు కెళ్లడానికి ఓ స్కూటరుంటే బాగుంటుందనుకుంటున్నాడు.." అంటూ చల్లగా అనేసరికి, అప్పటికే అప్పు తెచ్చి కట్నమిచ్చిన తాతగారు యేం మాట్లాడకుండా అక్కణ్ణించి వచ్చేసేరు.

తర్వాత అమ్మమ్మ తమ్ముడొకాయన, పిల్లమేనమావనంటూ వెళ్ళి బేరాలు మొదలెట్టేడు. అన్నింటికీ ఆ అప్పగారు యేదో చెప్పడం, వెళ్ళినవాళ్ళు పెళ్ళికొడుకైన బాబాయ్ వైపు చూడడం, ఆయన మొహంలో యేభావాలూ కనిపించకుండా ముభావంగా వుండడం, పెళ్ళిలో ప్రతివాళ్ళూ "పెళ్ళికొడుకు అలకపాన్పు దిగేడా.." అనడుగుతుంటే "అబ్బే.. ఇంకా యేదీ.." అని జవాబులు చెప్పుకుంటుండడం చూసి పదేళ్ళ రాంబాబు పెళ్ళిలో అలకపాన్పు కున్న ప్రాముఖ్యతని చూసి ఆశ్చర్యపడిపోయేడు.

అలాగ పెళ్ళిలో పెద్దమనుషులందరూ ఒకరి తర్వాత ఒకరుగా వచ్చి, పెళ్ళికొడుకుని ఒప్పించడానికి ప్రయత్నించడం, ఆఖరికి బాబాయ్ కి "ట్రాన్సిస్టర్ కొనిస్తా"నని తాతగారు చెప్పేక బాబాయ్ ఆ మంచం దిగి మిగిలిన పెళ్ళితంతు జరిపించడం చూసేడు.

అంతకన్నా యెక్కువగా యే యే పెళ్ళిళ్లలో యెవరెవరు అలకపాన్పుల మీద యేమేమి కావాలన్నారో అన్నీ కథలు కథలుగా విన్నాడు. అన్నింటికన్న యెక్కువగా పెళ్ళిలో పెళ్ళికొడుకు ప్రాముఖ్యం అంతా ఆ అలకపాన్పు యెక్కడం దగ్గరే వుందన్న నిశ్చితాభిప్రాయాని కొచ్చేసేడు రాంబాబు. యెందుకంటే ఒక్కొక్కరూ వచ్చి పెళ్ళికొడుకుని బ్రతిమాలడం, అతను బిగుసుకుపోయి కూర్చోడం, అతను కూర్చున్న తీరు, పలికించిన బావాలు, అన్న మాటలు రామకథలాగా ఒకరికొకరు చెప్పుకోడం ఇవన్నీ చూస్తుంటే పెళ్ళి చేసుకోవడమంటే అలకపాన్పు యెక్కి, అందరి దృష్టిలోనూ పడడమే అనేసుకున్నాడతను.

తర్వాత రాంబాబుకి పదిహేనేళ్ళున్నప్పుడు పెద్దమావయ్య పెద్దకొడుకు పెళ్ళైంది. అప్పుడతను కూడా అలకపాన్పు యెక్కుతాడు, చక్కగా చూడొచ్చు అనుకున్న రాంబాబు ఆశ నిరాశే అయ్యింది. యెందుకంటే అప్పటికే పెళ్ళిళ్ళలో పద్ధతులు మారిపోయేయి. పాతకాలంలోలాగా, ఆ టైమ్ లో సీన్ చెయ్యకుండా అలకపాన్పు మీద యేమివ్వాలో అల్లుళ్ళు ముందే మావగారికి చెప్పి, ఆ సమయానికి యెటువంటి ఆర్భాటవూ లేకుండా కావల్సినవి పుచ్చేసుకుంటున్నారు. కాని యిదేవీ నచ్చలేదు రాంబాబుకి. అసలు పెళ్ళికొడుకనే గుర్తింపేదీ.. ఆ హడావిడేదీ.. అదే అడిగేడు పెద్దమావయ్యని. దానికి పెద్దమావయ్య గట్టిగా

నవ్వేసి, "ఒరే.. నీ పెళ్ళి టైమ్ కి మళ్ళీ పద్ధతులు మారిపోతాయి లేరా.. అప్పుడు నేనే నీ పెళ్ళికి అలకపాన్పు వేయించి, నీ పక్కనుంటా.." అని మాట కూడా ఇచ్చేసేడు.

కాని అదేంటో..అప్పట్నించి రాంబాబు గమనిస్తూనే వున్నాడు.. పెళ్ళిలో పద్ధతులు మారేయి.. నిజమే కానీ.. యెవరూ మళ్ళీ పాత పద్ధతులవైపు వెళ్ళలేదు. అంతా కొత్త కొత్తవే కలుపుకుంటూ పోతున్నారు తప్పితే పాతవాటి ఊసే యెత్తటంలేదు. ఆడపెళ్ళివారూ, మగపెళ్ళివారూ అందరూ కలిసిపోయి సరదాగా పెళ్ళిళ్ళు చేసేసుకుంటున్నారు తప్పితే అసలు పెళ్ళికొడుకంటే ఒక ప్రత్యేకత, ఆ సమయంలో అతని కివ్వవలసిన ప్రాముఖ్యత యేమీ పట్టించుకోవటంలేదు. తన పెళ్ళిలో కూడా తనకి ప్రాముఖ్యం లేనప్పుడు యింక ఆ పెళ్ళిలో విశేషమేవుంటుందీ.. ఇదీ ప్రస్తుతం రాంబాబు సమస్య. యే విధంగా చేసి పెళ్ళిలో తన ప్రత్యేకతని చూపెట్టుకోవాలో అతనికి అర్థం కావటంలేదు.

రాంబాబు బుద్ధిగా చదువుకున్నాడు, చక్కటి ఉద్యోగం చేస్తున్నాడు. యెంచక్కా అమ్మా, నాన్నా ఎన్నిక చేసిన అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నాడు. అమ్మాయి కుందనం బొమ్మలాగా వుంటుంది. సరిసమానమైన ఉద్యోగం కూడా చేస్తోంది. తల్లితండ్రులకి ఒక్కతే పిల్ల.     యేం కావాలంటే అది అంతకు రెండింతలు చేస్తామంటున్నారు.

వీళ్ళు మూడు పూటలు పెళ్ళి చెయ్యమంటే వాళ్ళు మూడురోజులు చేస్తున్నారు. వీళ్ళు పూటకి మూడురకాల స్వీట్స్ చెయ్యమంటే వాళ్ళు ఆరు రకాలు చేస్తున్నారు. వీళ్ళు బంధువులందరికీ బట్టలు పెట్టాలంటే వాళ్ళు యేకంగా పట్టుబట్టలే పెడుతున్నారు. అలాకాకుండా తనని గుర్తించేలా వాళ్ళు టెన్షన్ పడేలా యేదైనా చెయ్యాలని రాంబాబు ఆలోచన.     అలా టెన్షన్ పడితే తప్ప పెళ్ళికొడుకుకున్న విలువ తెలీదని రాంబాబుకి చిన్నప్పటి సంఘటనలు చెప్పినవాటి సారాంశం. కాని ఇప్పుడలా చెయ్యలేడే.. యెందుకంటే ఇప్పుడందరూ చదువుకున్నవాళ్ళూ, సంస్కారవంతులూనూ. అలాగ ఇంకొకర్ని ఇబ్బంది పెట్టడం సంస్కారం కాదని వారందరి అభిప్రాయం. రాంబాబు కూడా దాన్ని కాదనడు. కాని చిన్ని కోరిక. ఆ పెళ్ళి టైమ్ లో తన గురించి అందరూ టెన్షన్ పడాలి. పెళ్ళికొడుకుగా తన విలువని గుర్తించాలి.. ఇదీ అతని ఆశ.

అందుకే పెళ్ళి బొత్తిగా నాలుగురోజుల్లో కొచ్చేసరికి పెళ్ళివారి సంగతలావుంచి ముందు రాంబాబుకి టెన్షన్ పెరిగిపోయింది. తిండి తినడం తగ్గిపోయింది. పరాకు పెరిగిపోయింది. రాంబాబు వాళ్లమ్మ అనసూయ ఇది కనిపెట్టేసింది. "యేమైందిరా?" అనడిగింది. చెప్పడే.. "అబ్బే..ఆఫీస్ లో పనెక్కువగా వుందమ్మా.." అనేసేడు. "యేపనైనా యింక రెండ్రోజులే. తర్వాత యింక నువ్వు ఆఫీసుకి వెళ్లడానికి వీల్లేదు. గుర్తు పెట్టుకో.." అని హెచ్చరించి మామూలుగా షాపింగ్ పనిలో పడిపోయిందావిడ. అంతే.. ఫ్లేష్ లా వెలిగింది రాంబాబు బుర్రలో బ్రహ్మాండమైన ఆలోచన. వెంటనే పకడ్బందీగా ప్లాన్ వేసేసేడు. అన్నివైపుల్నించీ ఆలోచించి యెక్కడా లొసుగులు లేకుండా చేసుకున్నాడు. మూడో చెవికి వినిపిస్తే మూడోప్రపంచయుద్ధం తథ్యమని తెలుసుకుని, పెదవి దాటకుండానే కాదు, చేతితో యెక్కడా రాయకుండా కూడా జాగ్రత్తపడి, మొత్తం ప్లానంతా బుర్రలోనే భద్రపరిచేసేడు.

ఆరాత్రి మగపెళ్ళివారు పెళ్ళికి తరలి వెళ్ళాలి. పెళ్ళివారిద్దరూ హైద్రాబాదులోనే వుండడంవల్ల, రాత్రికే ఫంక్షన్ హాల్ కి చేరుకుని, తెల్లారుతూనే పెళ్ళికొడుకుని చెయ్యడం, కాసేపటికి స్నాతకం, ఆవెంటనే పెళ్ళి చేసుకుంటే బాగుంటుందనుకున్నారు. తీరా అందరూ కార్లెక్కే సమయానికి రాంబాబు ఫోన్ లో మాట్లాడుతూ అనసూయ దగ్గరికొచ్చి, "అమ్మా, నేనిప్పుడు అర్జంట్ గా ఆఫీస్ కి వెళ్ళాలి. నేను చెసిన దాంట్లో యేదో డౌట్ వచ్చిందిట .అది క్లియర్ చెయ్యకపోతే కంపెనీకి బోల్డు నష్టం. అందుకని మీరు వెళ్ళండి. నేను ఆఫీస్ కెళ్ళి అక్కణ్ణించి డైరెక్ట్ గా హాల్ కి వచ్చేస్తాను.." అన్నాడు. అనసూయ యేదో చెప్పబోయింది. ఈలోగా తండ్రి రంగనాథం వచ్చేడు. సంగతి విన్నాడు. "అలాగైతే యెలాగరా" అన్నాడు.

"యేం ఫరవాలేదు నాన్నా. యెంతా ఓ గంట పని అంతే. అదవగానే అక్కడే వుంటాడు కదా.. రవన్నయ్య. వాడూ, నేనూ కలిసి వచ్చేస్తాం." అన్నాడు. రవి రాంబాబుకి పెదనాన్న కొడుకు. హైటెక్ సిటీలో రాంబాబు పని చేసే ఆఫీస్ దగ్గరే వాళ్ళిల్లు. రవి భార్య స్వప్న బెంగుళూర్ లో పనిచేస్తోంది. రవి ఒక్కడే వుంటున్నాడు. అందుకని మర్నాడు పెళ్ళిటైమ్ కి వస్తానన్న రవిని కూడా రంగనాథం బలవంతపెట్టి రాత్రికే వచ్చేలా ఒప్పించేడు. తలమ్ముకున్నాక ఇలాంటివి తప్పవుకదా అనుకుంటూ, "సరే..వాడికి ఫోన్ చెయ్యి. తొందరగా వచ్చెయ్యండి.." అంటూ పెళ్ళివారందరూ ఫంక్షన్ హాలు చేరుకున్నారు.

"అబ్బాయి యేడండీ.." అని ఆడపెళ్ళివారు అడిగినదానికి, "వెనకాల వస్తున్నాడు" అని చెప్పేరు.

టేక్సీ పిలిపించుకుని ఊరి చివరి రిసార్ట్ వైపు వెడుతున్న రాంబాబు "హుర్రే" అనుకున్నాడు సంతోషం పట్టలేక. పెళ్ళికొడుకు అలకపాన్పు యెక్కకపోతేనేం కాసేపు ఆడపెళ్ళివారికి టెన్షన్ పెట్టి తన ప్రత్యేకతను చూపించుకుంటాడు అనుకున్నాడు. ఆడపెళ్ళివారితో పాటు అమ్మా, నాన్నా కూడా టెన్షన్ పడతారని గుర్తు రాగానే ఒక్క క్షణం రాంబాబు గుండె కలుక్కుమంది. మళ్ళి అంతలోనే ఆ యెంతసేపు? మహా అయితే ఓ గంట.. అంతే.. అనుకున్నాడు. అందరూ "రాంబాబు యేడీ.. వచ్చేడా.." అనుకుంటూ ఆతృతగా ఒకళ్లనొకళ్ళు అడుగుతుండడం గురించి ఆలోచిస్తుంటేనే అతనికి పరవశం వచ్చేస్తోంది. చిన్నప్పట్నుంచి లోపల దాగున్న కోరిక తీరబోతున్నందుకు ఊహించుకుంటున్నకొద్దీ రాంబాబుకి వద్దనుకున్నా లోపలి సంతోషం పైకి తన్నుకొచ్చేస్తోంది.

ఆరాత్రికి రిసార్ట్ లో ఒక రూమ్ మొన్ననే బుక్ చేసుకున్నాడు. చేతిలో మొబైల్ లేకుండా, క్రెడిట్, డెబిట్ కార్డులు లేకుండా, కొన్నివేలు మటుకు జేబులో పెట్టుకుని రిసార్ట్ లో బుక్ చేసుకున్న రూమ్ లో దిగిపోయేడతను.

టైమ్ అవగానే డిన్నర్ తెచ్చేడు రూమ్ బాయ్. సయించి సయించకుండానే యేదో తిన్నాననిపించేడు. అతని ఆలోచనంతా ఫంక్షన్ హాల్ లో వున్న మనుషుల మీదే వుంది. ఓ గంటలో రవన్నయ్య హాల్ కి వెడతాడు. పక్కనే తను కనపడకపోతే.. అప్పుడు మొదలౌతుంది చూడూ తమాషా..

కళ్ళు మూసుకుని యేం జరగబోతుందో ఊహించుకుంటున్న రాంబాబు కళ్ళముందు ఆ దృశ్యం అతి మనోహరంగా కనపడసాగింది.

బహుశా ఈపాటికే రవన్నయ్య హాల్ కి చేరుకునుంటాడు. పక్కన తను లేకపోయేసరికి నాన్న "వీడేడిరా?" అంటారు. రవన్నయ్యకి తెలీదుగా తను వాడి దగ్గరికొస్తున్నట్టు నాన్నకి చెప్పినట్టు. అందుకని "యెవరూ?" అంటాడు రవన్నయ్య. అంతా తెల్లబోతారు. యింకా తను వస్తానని, పన్నీరు, గంధం, పూలూ వున్న పళ్ళెం పట్టుకుని నిలబడ్డ కాబోయే అత్తగారి చెయ్యి పన్నీటిబుడ్డి లోనికిసలాడేలా వణుకుతుంది. జారిపోతున్న పై కండువాని సర్దుకుంటూ మావగారు "బావగారూ.." అంటూ నాన్న వైపు చూస్తారు. ఆఫీస్ నుంచి నీదగ్గరకే వస్తానన్నాడని నాన్నా, నాకసలు ఫోనూ లేదు, మనిషీ లేడని రవన్నయ్యా చెప్పుకుంటూ తన మొబైల్ కి చేస్తారు. అదెక్కడుందీ.. తనింట్లో తన రూమ్ లో మంచం మీద వుంది. ఇంట్లో యెవ్వరూ లేరు. మోగి మోగి ఆగిపోతుంది. యింక మొదలౌతుంది చూడూ అందరిలో ఖంగారూ.. "పెళ్ళికొడుకు యేడండే యేడంటూ.." ఒకరి కొకరు అర్ధం కాకుండా మాట్లాడేసుకుంటూ, అరిచేసుకుంటూ, యెవరిని అడగాలో, యేంచెయ్యాలో తోచక, తెగ హడావిడి పడిపోతూవుంటారు. మొబైల్ ఇంట్లో తన రూమ్ లో మంచం మీదే వదిలేసి వచ్చేడు. మొబైల్ లో కూడా పలకకపోతే వాళ్ళు యేం చేస్తారు? యెవరిని అడుగుతారు? యెంత ఖంగారు పడతారు? ఆడపెళ్ళివారి మొహాలెలా మార్తాయి? ముఖ్యంగా తనని పెళ్ళిచేసుకోబోయే లత యెంత ఖంగారుపడిపోతుంది. తను యే ఆపదలో చిక్కుకున్నాడో అనుకుని, తనని రక్షించమంటూ యెందరు దేవతలకు మొక్కుకుంటుంది..

ఆ దృశ్యాలు ఊహించుకుంటున్నకొద్దీ రాంబాబుకి టన్నులకొద్దీ సంతోషం వచ్చేస్తోంది. అనుకుంటున్నకొద్దీ కడుపులోంచి తెరలు తెరలుగా నవ్వు వచ్చేస్తోంది. ఇదేవిటీ.. నవ్వుతోపాటు యింకేదో వచ్చేస్తోందీ.. రాంబాబు ఖంగారుపడ్డాడు.. కడుపులో అంతా యేమిటో తిప్పేస్తున్నట్టుగా వుంది. అనుకుంటుండగానే కడుపులో తిప్పడం యెక్కువయ్యింది. కాసేపయ్యేటప్పటికి రెండుమూడు వాంతులయిపోయేయి. రూమ్ సర్వీస్ బాయ్ కోసం బెల్ కొట్టి, వాడు వచ్చేలోపలే స్పృహ తప్పి పడిపోయేడు. మేనేజ్ మెంట్ వాళ్లందరూ పరుగు పరుగున వచ్చేరు. డాక్టర్ ని పిలిపించేరు. డాక్టర్ వచ్చి తిన్న ఆహారం పడలేదనీ, వాంతులవడం మంచిదేననీ, కాసేపు విశ్రాంతి తీసుకుంటే అంతా సర్దుకుంటుందనీ రాంబాబు మగతగా వుండగానే నిద్రకి ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళిపోయేడు.ఎవరికీ తన అసలు పేరు తెలీకూడదని అతని పేరు రిజిస్టర్ లో ఆనంద్ అని రాసాడు రాంబాబు. అడ్రస్, ఫోన్ నంబర్ కూడా తప్పుదే ఇచ్చేడు. అందులో వున్న నంబర్ కి ఫోన్ చేస్తే అసలా నంబరే పలకటం లేదు. ఇంక అక్కడివాళ్లకేం చెయ్యాలో తెలీక, ప్రమాదం లేదుకదా.. లేచేక ఆయనే చెపుతాడు అనుకున్నారు.

అక్కడ ఫంక్షన్ హాల్ దగ్గరున్న రాంబాబు తండ్రి ఓ గంటాగి రాంబాబుకి ఫోన్ చేసేడు. కానీ అది ఇంట్లో మంచం మీదే వదిలెయ్యడంతో యెవరూ యెత్తటంలేదు. యింక యిలా లాభంలేదని ఆయన రవికి ఫోన్ చేసేడు. రవి మొబైల్ లో బాబాయ్ పేరు చూడగానే, వెంటనే యెత్తి, "ఇదిగో బాబాయ్ వచ్చేస్తున్నాం.." అన్నాడు. సరేననుకున్నారాయన. ఓ గంట చూసి మళ్ళీ చేసేరు. "ఇదిగో బయల్దేరుతున్నాం బాబాయ్.." అన్నాడు రవి. ఆయనకి ఆరాత్రివేళ ఆరోడ్ల మీద పిల్లలు రావడం మంచిది కాదనిపించి, "ఒరేయ్, ఇంకిప్పుడొద్దు కానీ తెల్లారగట్ల నాలుగ్గంటలకల్లా బయల్దేరండి. రాగానే వరసగా పెళ్ళికొడుకుని చెయ్యడం, స్నాతకం

అయిపోతాయి." అన్నారు. "అలాగే బాబాయ్"అన్నాడు అటినుంచి రవి. "ఒరేయ్.. మర్చిపోకుండా అలారం పెట్టుకుని పడుకోండి.." హెచ్చరించేరాయన పిల్లల్ని. తెల్లారగానే రవీ, రాంబాబూ వచ్చేస్తారనీ, ఈ లోపల ఓ కునుకు తియ్యమనీ పెళ్ళికొచ్చిన బంధువులందరికీ చెప్పేరాయన. అందరూ హాయిగా నిద్రకు పడ్డారు.

రిసార్ట్ లో అలా మత్తుగా పడుకున్న రాంబాబుకి తెల్లవారకట్ల హఠాత్తుగా యెవరో కొట్టినట్టు మెలకువొచ్చింది. కాసేపు యెక్కడున్నాడో, యేంటో అర్థంకాలేదు. నెమ్మదిగా ఒక్కొక్కటీ గుర్తు చేసుకుని ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు. టైమ్ చూస్తే నాలుగౌతోంది. బాయ్ ని పిలిస్తే రాత్రి జరిగిందంతా చెప్పేడు. హడావిడి పడిపోతూ టేక్సీ పిలవమని చెప్పి, యెక్కి కూర్చున్నాడు. ఆ టేక్సీ సిటీ లిమిట్స్ లో కొచ్చేక మఠం వేసి యింక కదలనని కూర్చుంది. జంక్షన్ దాకా నడిచి ఆటో యెక్కేడు. దానికేవయిందో టర్న్ తిరుగుతూ పక్కకి ఒరిగిపోయింది. పాపం రాంబాబుకి, కాబోయే పెళ్ళికొడుక్కి రోడ్డు పక్క రాళ్ళు కొట్టుకుని మోచేతులు, మోకాళ్ళూ చెక్కుకుపోయేయి. తెలుగు సినిమాలో క్లైమాక్స్ లో హీరో లాగ కాళ్ళు, చేతులూ కూడదీసుకుంటూ, పడుతూ, అటుగా వస్తున్న ప్రతి వాహనాన్నీ ఆపడానికి చేతులు అడ్డంగా ఊపేస్తూ తెగ హైరాణా పడిపోయేడు రాంబాబు. అలాంటి అవస్థలోవున్న రాంబాబు పక్కన ఒక కారు ఆగింది. యెవరా అని చూస్తే రవన్నయ్య, స్వప్నవదిన వున్నారందులో.

"ఒరే రాంబాబూ.. నువ్వేవిట్రా యిక్కడా.. యేవయ్యిందీ..?" ఆతృతగా అడిగేడు రవి. ప్రాణం లేచొచ్చింది రాంబాబుకి. "అవన్నీ తర్వాత చెప్తాను. ముందు నడు" అంటూ కారు యెక్కి కూర్చుని, "అవునూ.. నువ్వు నిన్న రాత్రికే రావాలికదా.. ఇప్పుడు వస్తున్నావేం?" అని అడిగేడు. "అదికాదురా.. అనుకోకుండా మీ వదిన బెంగుళూరు నుంచి వస్తున్నానని ఫోన్ చేసింది. ఇప్పుడే బస్ దిగింది. బస్ స్టేండ్ నుంచి డైరెక్ట్ గా ఇక్కడికే వస్తున్నాం. బాబాయ్ ఫోన్ చేస్తే కూడా అదే వచ్చేస్తున్నావనే చెప్పేను. బాబాయ్ కూడా అదే అన్నాడు. చీకట్లో రావద్దూ, తెల్లారేక రమ్మన్నాడు. ఒక్కసారే పెళ్ళికొడుకుని చెయ్యడం అన్నీ అయిపోతాయన్నాడు. మరి యిదేవిట్రా.. నువ్విక్కడ రోడ్డు మీద యిలా వున్నావేంటీ..? " అన్నాడు రవి. రాంబాబుకి అర్థమైంది. రాత్రి రవి ఫంక్షన్ హాల్ కి వెళ్ళలేదు. తను రవి దగ్గర వున్నాడనే పెళ్ళింట్లో అందరూ అనుకుంటున్నారు. వదినతో కలిసి వస్తాం అని రవన్నయ్య చెప్పడం వల్ల వాళ్ళందరూ తనతో కలిసి రవన్నయ్య వస్తున్నట్టు అనుకున్నారు. అంటే పెళ్ళింట్లో యెవరూ రాత్రి తన గురించి టెన్షన్ పడలేదు. యెక్కడలేని నిస్త్రాణ వచ్చేసింది రాంబాబుకి. అయిపోయింది. అంతా అయిపోయింది. తన కోరిక.. చిన్న కోరిక. చిన్ననాటినుంచి పెంచుకొస్తున్న కోరిక.. ఆఖరికిలా నీరుగారిపోయింది...అనుకుంటూ దగ్గరౌతున్న ఫంక్షన్ హాల్ ని చూస్తూ నీరసంతో తల వాల్చేసేడు..

ఖంగారుపడిపోయేడు రవి. కారాపగానే యెదురుగా నిలబడ్డవారందరితోనూ "తప్పుకోండి.. తప్పుకోం"డంటూ రాంబాబుని చేతుల మీద తీసుకొచ్చి అక్కడి సోఫాలో పడుకోబెట్టేడు. అందరూ "యేమైందేమైం"దంటూ ఖంగారుపడిపోయేరు. డాక్టర్లైన బంధువులు గబగబా ముందుకొచ్చి పల్సూ గట్రా చూసేరు. రంగనాథంగారు నిశ్చేష్టులై నిలబడిపోయేరు. అనసూయ హడావిడిపడిపోయింది. కాబోయే అత్తగారూ, మావగారూ కాళ్ళుచేతులూ ఆడక శిలాప్రతిమలైపోయేరు. పెళ్ళికూతురు రూమ్ లోంచి పరిగెత్తుకుంటూ వచ్చేసింది. కొందరు చల్లటి మంచినీళ్ళు అందిస్తే, ఇంకొందరు వేడి వేడి హార్లిక్స్ తెచ్చేరు. మరికొందరు తాజాగా పళ్లరసం తీయించుకొచ్చేరు. కాస్త తెప్పరిల్లిన రాంబాబు నెమ్మదిగా కళ్ళు తెరిచేటప్పటికి అందరూ తనవైపే యెంతో

ఆతృతగా చూస్తుండడం కనిపించింది. అంతే.. అతను ఒక్కసారిగా "హుర్రే.." అని అరిచేసేడు.

***